ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

మేడ్చల్ | శనివారం | 21.03.2026 | సంపుటి : 1 | సంచిక : 263 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ,
రాజకీయ, వివాహ,
జన్మదిన తదితర ప్రకటనల
కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 180 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 207 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 300 (కిలో) |
| స్కిన్ లెస్ | 342 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹64



## గోదావరిలో ఐదుగురు గల్లంతు

ముగ్గురు మృతి..

మరో ఇద్దరి కోసం గాలింపు

04

గోదావరి నదిలో స్నానానికి వెళ్లినవారిలో ఐదుగురు యువకులు గల్లంతుకాగా.. వారిలో ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగతా ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం సరిహద్దు ప్రాంతం కూనవరంలో జరిగింది.

## ఎరువుల ఉత్పత్తికి ఇంధన పోటు

- ఎరువుల సరఫరాను నిలిపివేయనున్న చైనా
- భారత్ తదితర దేశాలకు రవాణ ఆపే చర్యలు
- పలుదేశాల వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం

06



ముడి చమురు సరఫరాలో అవాంతరాలతో ఇక్కట్ల పాలవుతున్న ప్రపంచదేశాలకు కొత్త సమస్య వచ్చి పడేటట్టు ఉందన్న భయాలు నెలకొన్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల.. జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. -మిగతా 2 లో..



## భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

మూడు దశల్లో దేవస్తానం అభివృద్ధి పనులు

మాస్టర్ ప్లాన్‌పై చర్చించిన మంత్రులు

**హైదరాబాద్, మార్చి 20 :** తెలంగాణలోని ప్రముఖ పుణ్య క్షేత్రం, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, -మిగతా 2 లో..

# 2026-27 తెలంగాణ బ్జడెట్ ₹ 3,24,234 కోట్లు

## రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు
## మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లు

శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు..

దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్.1 స్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్న భట్టి




తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రసంగాన్ని ప్రారంభించారు. రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేడ్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్, జనం వార్త ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బ్జడెట్ లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌలిక సదు-పాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయిం చారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవ కులం' అని భట్టి విక్రమార్క తెలిపారు. రూ.3,24,234 కోట్లతో మిగతా 2 లో



## నేడు రంజాన్
### సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు


**హైదరాబాద్, మార్చి 20 :** రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగను ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామ-రస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, మిగతా 2 లో



06

## మధ్యప్రాచ్యంలో తగ్గని ఉద్రిక్తతలు

- అమెరికా, ఇజ్రాయిల్‌లకు మద్దతు ఇస్తే దాడులు తప్పవు
- గల్ఫ్ దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు



## హర్మూజ్ విముక్తికి అమెరికా యత్నాలు

జలసంధిని తెరిచేందుకు కీలక పోరు

ఇరాన్ బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

యూరోపియన్ దేశాలు సైతం మద్దతు

06

హర్మూజ్‌పై పట్టుకు అమెరికా యత్నాలు ప్రారంభించింది. ఇరాన్ క్షిపణులను, డ్రోన్లు, బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది. హర్మూజ్ విముక్తికి యూరోపియన్ దేశాలు సైతం మద్దతుగా ముందుకు సాగనున్నాయి. ప్రపంచ చమురు జీవనాడి హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు కీలక పోరును అమెరికా మొదలుపెట్టింది. ఇందుకోసం తీర ప్రాంతంలో ఇరాన్ మోహరించిన క్షిపణి లాంచర్లు, డ్రోన్లు, బోట్లు వంటి లక్ష్యాలను ఛేదించేందుకు తక్కువ ఎత్తులో ఎగిరే అపాచీ అటాక్ హెలికాప్టర్లు , తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలను రంగంలోకి దింపినట్లు అమెరికా సైనికాధికారులను ఉటంకిస్తూ కథనంలో వెల్లడించింది.



## ఆర్భాటాలు.. ప్రగల్భాలే..

02

- బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదు
- అప్పుల కోసం చేసే ప్రయత్నాలే ఎక్కువ
- బడ్జెట్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదాయాన్ని పండబెట్టి.. అప్పుల కోసం అర్రులు చాచే బ్జడెట్ ఇది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ తీవ్రంగా విమర్శించారు.

## ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు

హరీష్ రావుకు ట్యాపింగ్‌లో ఊరట అబద్ధం

పదో తరగతి పరీక్షలు లేకుండా 12 తరగతులు

తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులకు కసరత్తులు

మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం

రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం అప్పులకు చెల్లించాం

డ్రగ్స్‌పై నోరుమెదపని బిజెపి, బిఆర్ఎస్ నేతలు

మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మార్చి 20 :** ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్టప్రకారమే ముందుకు వెళ్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు 20 నెలలు ఆలస్యమైందన్నారు. ఇందులో అరెస్టులు తప్పవని కూడా అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దొరికినా.. భాజపా నేతలు మాట్లాడటం లేదని, బీఆర్ఎస్, భాజపా కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని -మిగతా 2 లో..

## ఆరు గ్యారెంటీలకు సమాధి కట్టారు

బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం

మహిళల పెన్షన్‌పై మాట్లాడని బడ్జెట్

పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది

భట్టి కేటాయింపులపై హరీష్ రావు పెదవి విరుపు



హైదరాబాద్, జనం వార్త ప్రతినిధి : తెలంగాణ బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పెదవి విరిచారు. ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్య లను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పించన్ పెంపు హామీలను కూడా సర్కారు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందులో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమీ లేదని హరీష్‌రావు విమర్శించారు. అంకెలగారడీ, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి -మిగతా 2 లో..

# ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. ఇకపోతే పదో తరగతి పరీక్షలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఇకపై పదో తరగతి పరీక్షలు లేనట్లే'నని చెప్పారు. ప్రస్తుతం.. దేశమంతా ప్లస్ 2 విధానం అమల్లో ఉందని ప్రస్తావించారు. తమది వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో చట్టప్రకారమే ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము తొందరపడితే టెక్నికల్ రీజన్స్‌తో కోర్టు తిరస్కరించే ప్రమాదముందని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయస్థానంలో ఊరట లభించలేదన్నారు. చక్రధర్ గౌడ్.. హరీశ్‌రావుపై పెట్టిన ఫోన్ ట్యాపింగ్, వేధింపుల కేసులో ఆయనకు రిలీఫ్ లభించిందని ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనను విచారణకు రమ్మని నోటీసులిస్తే హాజరవుతానని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో విచారణ పూర్తి కాకుండా చర్యలు తీసుకోలేమని అన్నారు. కేసీఆర్ బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారు. అందుకే ఆయన అసెంబ్లీకి రావడంలేదన్నారు. తెలంగాణ జాతిపిత ఎవరో ప్రజలు డిసైడ్ చేయాలన్నారు. ఏ గ్యారంటీ ఎప్పుడు అమలు చేయాలో తమ దగ్గర ప్రణాళిక ఉందని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు చెబితే చేయాలని లేదన్నారు. అందుకే వారు అక్కడ ఉన్నారు..మేము ఇక్కడ ఉన్నామని అన్నారు. కేసీఆర్ హయాంలో అప్పులు, తప్పులు కప్పిపుచ్చి పాలన చేశారని ఎద్దేవా చేశారు. ఆ తప్పులు తాము చేయలేమన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3.47లక్షల కోట్ల అప్పులు చేశామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులను తీర్చేందుకే తామీ అప్పులు చేయాల్సి వచ్చిందని ప్రస్తావించారు. ఈ 26 నెలల్లో రూ.3.3 లక్షల కోట్లు కేసీఆర్ హయాంలో చేసిన అప్పుల్నే తమ ప్రభుత్వం తీర్చిందని చెప్పుకొచ్చారు. మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం. రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకు చెల్లించాం. మేం తెచ్చిన అప్పుల్లో కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే వాడుకున్నాం. జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ మెరుగ్గా ఉంది. జీఎస్టీ వసూళ్లు గడిచిన 2 నెలల్లో రూ.4 వేల కోట్లు దాటాయి' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకపోయినా రూ.44 వేల కోట్ల కాళేశ్వరంపై అప్పు తీర్చామన్నారు. హిల్ట్ టీడీఆర్ భూ బదలాయింపుల పై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఏ విచారణ కోరినా చేపట్టేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇండస్ట్రీకు చెందిన మొత్తం భూములు అమ్మినా లక్ష కోట్ల రూపాయలు రావని ముఖ్యమంత్రి తెలిపారు. హిల్ట్‌లో ఐదు లక్షల కోట్ల రూపాయల అవినీతి ఎలా జరిగిందని ప్రశ్నించారు. మంత్రి అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ కోసం సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ గవర్నర్‌ను సంప్రదిస్తామని తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను తొలగించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. ఇప్పుడున్న జిల్లాలు మండలాల్లో ప్రస్తుతం ఎలాంటి మార్పులూ ఉండవని ఆయన స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కేకే కమిటీకి రిఫర్ చేశామని పేర్కొన్నారు. భూముల అమ్మకానికి కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని సీఎం స్పష్టం చేశారు. భూములు అమ్మితే వచ్చిన డబ్బులను సొంతానికి వాడుకోవడానికి తాము వ్యతిరేకమన్నారు. మూసీ విషయంలో ఆగేది లేదన్నారు. నష్టపోయిన వారిని ఎలా ఆదుకోవాలో ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకుంటామని తెలిపారు. ఢిల్లీకి ఎన్నిసార్లు వెళ్లానో లెక్కపెట్టిన వాళ్లు తాను ఎన్ని నిధులు తెచ్చానో కూడా లెక్కపెట్టాలని హితవు పలికారు. గాంధీ మనుమడు కూడా ఒక పౌరుడేనని.. ప్రస్తుతం ఆయనా బీఆర్ఎస్ ట్రాప్‌లో పడ్డారని అన్నారు. గాంధీ విగ్రహం పెట్టొద్దని అనడం సరికాదని, గాంధీ దేశానికి ఆదర్శపురుషుడని అన్నారు. డ్రగ్స్ అంశంలో ఇంత జరుగుతుంటే.. బీజేపీ నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలను తిడితే బీజేపీ ఎందుకు మాట్లాడుతోందని నిలదీశారు. ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారని అన్నారు. తనను సీఎంగా అంగీకరిస్తున్న మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. జీవన్ రెడ్డి అంశాన్ని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చూసుకుంటారన్నారు. ఆపరేషన్ కగార్ కేంద్ర ప్రభుత్వానిది.. తమది కాదని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిపై కమిటీ అధ్యయనం చేస్తోందన్నారు. మార్పులపై కమిటీ నివేదికే ఫైనల్ కాదన్నారు. జాతీయస్థాయి అధ్యయనం తర్వాత మార్పులు తీసుకురాబోతున్నట్లు చెప్పారు.

# భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

(మొదటిపేజీ తరువాయి)

వాకాటి శ్రీహరి అన్నారు. భద్రాద్రిని ఒక అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని వెల్లడించారు. భద్రాచలం ఆలయ రూపురేఖలను మార్చేలా రూపొందించిన మాస్టర్ ప్లాన్ పై శుక్రవారం నాడు సచివాలయంలోని మంత్రి కొండా సురేఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రెండు వందల సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల మనోభావాలకు అనుగుణంగా మూడు దశల్లో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపైముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపునివ్వాలని సమావేశంలో నిర్ణయించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేనాటికి భద్రాచలంలో పుష్కర ఘాట్‌తో పాటు మొదటి దశ ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలాన్ని తెలంగాణలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక హబ్‌గా మారుస్తామన్నారు. భద్రాచలం సమీపంలోని రామవరంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గోదావరి పుష్కరాలలో భాగంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన కొరివి వీరభద్రస్వామి దేవాలయం, మల్లూరు లోని నరసింహాస్వామి దేవాలయాలను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో పార్లమెంట్ సభ్యులు బలరాం నాయిక్,ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్‌బిసి ఇన్‌లెట్ తవ్వకాల పునరుద్ధరణ

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 20 :** ప్రతిష్టాత్మక ఎస్.ఎల్.బి.సి ఇన్‌లెట్ తవ్వకాల పునరుద్ధరణ పనులు ప్రారంభం అయ్యాయని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే దేవరకొండ నుండి ఔట్‌లెట్ పనులు ప్రారంభం అయిన నేపద్యంలో ఇప్పుడు ఇ÷-లనెట్ పనులు కుడా ప్రారంభమయిన నేపద్యంలో ఎస్.ఎల్.బి.సి తవ్వకాలు వేగవంతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఎస్.ఎల్.బి.సి తో పాటు, డిండి ఎత్తిపోతల పధకం, అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ పురోగతిపై ఆయన ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్ తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెండు వైపులా తవ్వకాలు ప్రారంభం అయినందున ఇకపై నిరంతరాయంగా పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగ మార్గంగ నిలువనున్న ఈ ప్రాజెక్ట్ తవ్వకాలలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు నిబంధనలు కటినంగా పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. తవ్వకాల సమయంలో సొరంగ మార్గం చివరికంటూ గాలి వెలుతురు ప్రసారం అయ్యేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. పనులు పునఃప్రారంభం కావడానికి ముందే 20 మీటర్ల దూరం ఓపెన్ కట్ చేయడంతో పాటు అదనపు భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టినట్లు ఆయన వివరించారు. ఇప్పటికే తవ్వకాలు ప్రారంభించిన ఔట్ లెట్ తవ్వకాలలో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి 20 మీటర్ల దూరం పూర్తి చేశామని ఆయన తెలిపారు. ఏడూ సంవత్సరాలుగా ఔట్ లెట్ పనులు నిలిచి పోయిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ 43.93 కిలోమీటర్ల పొడవైన ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం శ్రీశైలం ఎడమ కాలువ భాగం నుండి మొదలు పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

# రాష్ట్ర బడ్జెట్ రూ.3,24,234కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంటే అంకెల చుట్టూ తరిగడం కాదని, అభివృద్ధి సంఖ్యలను ఆవిష్కరించ డమని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు, మూలధన



వ్యయం.. రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే.. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతని చ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటా యించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాం బూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన - ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లోబీమా పథకాలను చేర్చారు. ప్రతి పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు 'ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం' కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్‌లో ఒక కీలక అడుగుగాభావించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందచేస్తారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం ఇస్తారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేపట్టారు.. కేటాయింపులను పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు, బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు, మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మి పథకం.. రూ.3,683 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీ కి రూ.వెయ్యి కోట్లు, మెట్రో రైలు ఫేజ్-2.. రూ.600 కోట్లు, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పథకం.. రూ.723 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ.. రూ.1143 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్.. రూ.3500 కోట్లు, మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటయిస్తున్నట్లు భట్టి ప్రకటించారు.

- ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు
- 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా
- జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయింపు
- విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయింపు
- వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు
- విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు
- పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు
- పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు
- విద్యా శాఖకు రూ.26,674 కోట్లు
- వైద్య శాఖకు రూ.13,679 కోట్లు
- కార్మిక శాఖకు రూ.998 కోట్లు
- మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు
- ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు,
- ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు
- బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు
- మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు
- ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు
- యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు
- మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు
- ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు,
- రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు

# ఆరు గ్యారెంటీలకు సమాధి కట్టారు

(మొదటిపేజీ తరువాయి)

పేదలపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు అభయహస్తమని హామీ ఇచ్చారని, ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా రిక్తహస్తమే మిగిల్చారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లు కాలేదుగానీ మూడున్నర లక్షల కోట్లు అప్పులు చేసిందని, తెచ్చిన ఆ అప్పుతో ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడితే.. కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో వెనుకపడేసిందని హరీష్‌రావు విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి అంబేద్కర్ సూక్తులు, రాజ్యాంగ విలువలను వల్లెవేశారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనుక కూసోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి ఆయన మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గోరీ కట్టారని దెప్పిపొడిచారు. ఈ బ్జడెట్‌ను చూస్తే ఎన్నికల హామీలపై కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమైందని అన్నారు. గతం కంటే 20పేజీలు పెంచారు తప్ప.. హామీలకు కేటాయింపులు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని ధ్వజమెత్తారు. సీఎం ప్రజలకే కాదని.. ఎమ్మెల్యేలకు సైతం అందుబాటులో ఉండటం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 3లక్షల పింఛన్లు కట్ చేసి.. 2లక్షల కొత్త పెన్షన్లు ఇస్తామంటున్నారని అన్నారు. కోటీశ్వరులు సంగతి అటుంచి.. మొదట మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్, ఇందిరమ్మ పేర్లతో అమలవుతోన్న స్కీంలకు సైతం కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపిం చారు. కాంగ్రెస్‌ది.. అభయ హస్తం కాదని.. రిక్త హస్తమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది మూడు ముక్కలాట తప్ప.. విజన్ లేదని దెప్పిపొడిచారు. బ్జడెట్‌లో అన్నివర్గాలకు మొండి చెయ్యి చూపారని ఆగ్రహించారు. మూడున్నర లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. రేవంత్ చేసిందేమీ లేదని విమర్శిం చారు. బీఆర్ఎస్ హయాంలో సచివాలయం, కాళేశ్వరం, చెక్ డ్యాంలు కట్టామని ప్రస్తావించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెనుక కూర్చోపెట్టుకుని భట్టి.. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహించారు. కాంగ్రెస్ హయాంలో స్కాంలు తప్ప.. స్కీంలు లేవని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో స్కాం జరిగిందని మంత్రి బిడ్డ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. గురుకుల పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టలేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడేమో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటున్నారని దెప్పిపొడిచారు. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వానివి కట్టుకథలని విమర్శించారు. అక్రమ సంపాదన దాచుకోవటానికే ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టినందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాలన గాడి తప్పటం వలనే తలసరి ఆదాయం తగ్గిందని అన్నారు. పారిశ్రామికవేత్తలకు తుపాకులు పెట్టి మాముళ్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి యాదాద్రిని మూసేస్తామంటే.. భట్టి ఏమో యాదాద్రి తెలంగాణకు గర్వకారణమని అంటున్నారని అన్నారు. సింగరేణి గురించి కాంగ్రెస్‌కు మాట్లాడే హక్కు లేదన్నారు. సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారని హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బడ్జెట్ ప్రతులను చించేసిన బిఆర్ఎస్

## ఆరు గ్యారెంటీలపై సభలో నినాదాలు

## బడ్జెట్ బహిష్కరిస్తూ వాకౌట్

**హైదరాబాద్, మార్చి 20 :** తెలంగాణ అసెంబ్లీలో ఇవాళ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా మోసమని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మండిపడింది. బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు ప్రతులను చింపిపారేశారు. అనంతరం సభ నుంచి వాకౌట్ చేశారు. దాంతో అసెంబ్లీలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బ్జడెట్‌కు నిరసనగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బ్జడెట్ ప్రసంగం ప్రారంభించగానే.. బీఆర్ఎస్ సభ్యులు వినూత్న రీతిలో తమ నిరసన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ప్రజలను 'చెవిలో పూలు' పెట్టి మోసం చేస్తోందంటూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ చెవుల్లో పూలు పెట్టుకుని సభ నుంచి బయటికి వచ్చారు. ముందుగా బ్జడెట్ ప్రసంగం మొదలవగానే.. ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ముఖ్యంగా 'ఆరు గ్యారంటీల' అమలు తీరుపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం సభ నుంచి బయటికి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ఎంట్రీ వద్దకు చేరుకుని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 'తులం బంగారం మోసం మోసం' అని నినాదాలు చేస్తూ ప్రభుత్వం పేద మహిళలను వంచించిందని విమర్శించారు. 'రెండు లక్షల ఉద్యోగాలు మోసం మోసం' అని నినదిస్తూ యువతకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవడం లో విఫలమైందని మండిపడ్డారు. ఇక 'బ్జడెట్ మోసం మోసం' అని నినాదాలు చేస్తూ ఈ బ్జడెట్‌లో పేదలకు, రైతులకు, మహిళలకు ఎలాంటి న్యాయం జరగలేదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు.

# నాటో దేశాలపై ట్రంప్ అక్కసు

**వాషింగ్టన్, మార్చి 20 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాటో సభ్యదేశాల వ్యవహారశైలిపై అసహనం వ్యక్తంచేశారు. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు కలిసి రావాలన్న ఆయన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంపై ఆయన చిర్రుబుర్రలాడారు. పిరికివాళ్లంటూ ఎద్దేవా చేశారు. ఈ సందర్భాన్ని గుర్తు పెట్టుకుంటానని హెచ్చరిస్తూ ట్రూత్ సోషల్‌లో ఆయన శుక్రవారం ఓ పోస్ట్ పెట్టారు.ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా జరిపిన దాడి నేపథ్యంలో చమురు రవాణాకు జీవనాడి నాటి లాంటి హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ అవాంతరాలు సృష్టిస్తోంది. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్నాయి. కొన్ని దేశాలు చమురు, గ్యాస్ కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో హర్మూజ్‌ను తిరిగి తెరిపించేందుకు కలిసి రావాలని డొనాల్డ్ ట్రంప్.. నాటో దేశాలకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏ దేశమూ ముందుకు రాకపోవడం ట్రంప్‌నకు కోపం తెప్పించింది. 'అమెరికా లేకపోతే నాటో కేవలం ఒక పేపర్ టైగర్ మాత్రమే. అణ్వాయుధ శక్తిగా మారుతున్న ఇరాన్‌ను అడ్డుకునే పోరాటంలో పాల్గొనడానికి అప్పుడు సుముఖత చూపలేదు. కానీ, ఇప్పుడు అధిక ధర చెల్లించాల్సి వస్తుండడంతో చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. దీనికి కారణమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు అవసరమైన సైనిక చర్యకు మాత్రం ముందుకు రావడం లేదు. పిరికివాళ్లు. గుర్తు పెట్టుకుంటా!' అంటూ డొనాల్డ్ ట్రంప్ పోస్ట్ చేశారు.

# ఆర్భాటాలు.. ప్రగల్భాలే..

**హైదరాబాద్, మార్చి 20 :** 'మోసం.. దగా.. ప్రజా వంచన బ్జడెట్ ఇది' అంటూ వ్యాఖ్యలు చేశారు.మరో రూ.లక్ష కోట్ల అదనపు అప్పు భారం ప్రజలపై మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గు చేటని అన్నారు. రాష్టాన్ని భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని అన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకేమీ చేయలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధులు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారని ఆరోపించారు. 'మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్.. రూ.2,500లు నిల్' అని అన్నారు. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని.. రూ.4 వేల పెన్షన్ పెంపు గురించి ఊసే లేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని.. బ్జడెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు అంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఆరు గ్యారంటీలకు పాడె కట్టే బ్జడెట్ ఇదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీకి కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదించినా 8 శాతానికే పరిమితం చేశారని బండి సంజయ్ విమర్శించారు. దేవాదాయ శాఖకు గత బ్జడెట్‌లో రూ.190 కోట్లు కేటాయించినా ఈసారి ప్రస్తావనే లేదని అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 56 శాతం బీసీ జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా బ్జడెట్‌లో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మైనారిటీలకు గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని.. ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

# నేడు రంజాన్

(మొదటిపేజీ తరువాయి)

క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్ధనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

# ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

## మంత్రి శ్రీహరి ఇంటిని ముట్టడించిన ఆశా కార్యకర్తలు

**నారాయణపేట, మార్చి 20 :** తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఇంటిని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ముట్టడించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే కోరుతూ పెద్ద సంఖ్యలో ఆశా కార్యకర్తలు అక్కడికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొన్ని రోజులుగా ఆశా కార్యకర్తల సమస్యలపై పోరాటాలు చేస్తున్నా గాని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఆశా వర్కర్లకు రూ. 18 వేలు వేతనం వెంటనే అమలు చేయాలని, ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆశా వర్కర్లపై పెరుగుతున్న పనిభారం తగ్గించి, అదనపు భత్యాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలన్నారు. గర్భిణిలు, శిశు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశాలకు ప్రత్యేక గౌరవ వేతనం ఇవ్వాలి. ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు

- వేయికోట్ల కుంభంకోణం జరిగింది
- రిటైర్డ్ అధికారుల నియామకంలో లాలూచీ
- స్కాం వివరాలను ఎండగడతాం
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



**హైదరాబాద్, మార్చి 20 :** ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు కొనసాగుతున్నాయని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులను పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి స్కాంలు చేస్తున్నాడని అన్నారు. అందులో సీఈ, ఈఎన్‌సీ అందరూ రిటైర్డ్ వాళ్లే ఉన్నారని తెలిపారు. నాలుగైదు స్కూళ్లను ప్యాకేజీ చేసి అన్యాయాలకు తెర తీశారని హరీశ్‌రావు మండిపడ్డారు. వీటి టెండర్లలో రూ.1000 కోట్ల స్కాం జరిగిందని అన్నారు. ఇందులో బీజేపీ వారికి ఒకటి, రెండు ప్యాకేజీలు దక్కాయని తెలిపారు. సమయం వచ్చినప్పుడు ఆ వివరాలన్నీ బయటపెడతామని స్పష్టం చేశారు. ఈ వందల కోట్ల టెండర్ల కుంభకోణంపై శాసనసభలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని అన్నారు. నా దగ్గర ఈ స్కామ్ కు సంబంధించి ఇంకా పూర్తి ఆధారాలు, వివరాలు ఉన్నాయని.. వాటన్నింటినీ అసెంబ్లీ సమావేశాల్లో సభ సాక్షిగా బయటపెడతానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు పూర్తి చేయగా, అందులో ఒక్కటంటే ఒక్కటి కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న 26 నియోజకవర్గాలకు ఇవ్వలేదని హరీశ్‌రావు తెలిపారు. కక్షపూరితంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్కూళ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు, అలాగే కొందరు బీజేపీ ఎమ్మెల్యేలకు మాత్రం స్కూళ్లు కేటాయించారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి జరుగుతోందని హరీశ్‌రావు అన్నారు. కాంట్రాక్టర్లు ఆర్గనైజ్డ్ రింగ్ గా అయ్యి పనులను పంచుకుంటున్నారని అన్నారు. 76 స్కూళ్లకు సంబంధించిన ప్రతి టెండర్ కి ఎక్సెస్ ధర కోట్ చేసి దక్కించుకున్నారని తెలిపారు. టెండర్లలో కనిష్టంగా 4.59? నుంచి గరిష్టంగా 4.96? ఎక్సెస్‌తో, నిబంధనల ప్రకారం 5? దాటకుండా పక్కా ఎ÷–లాన్‌తో కొల్లగొట్టారని విమర్శించారు. ఒక్కో స్కూలుకు రూ. 250 కోట్లు కేటాయించగా, అందులో సివిల్ వర్క్స్ కోసమే సుమారు రూ. 150 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారని చెప్పారు. 76 స్కూళ్లకు సంబంధించి ప్రభుత్వ అంచనా వ్యయం రూ. 10,199.54 కోట్లు కాగా, కాంట్రాక్టర్లు దాన్ని రూ. 10,693.55 కోట్ల ఎక్సెస్‌తో దక్కించుకున్నారని అన్నారు. అంటే కేవలం ఈ టెండర్ల ద్వారా సుమారు రూ. 494 కోట్లు ప్రజాధనాన్ని అదనంగా దోచిపెడుతున్నారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ తో పాటు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరల్లో అత్యధికంగా 4.95 శాతం ఎక్సెస్ ధరకు టెండర్లు కేటాయించడం పలు అనుమానాలకు కలిగిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నియోజకవర్గంలో 4.95 ఎక్సెస్.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గం హుజూర్ నగర్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గం హుస్నాబాద్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని.. మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గం కొల్లాపూర్ లో 4.77 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని చెప్పారు. మంత్రి కొండా సురేఖ నియోజకవర్గం వరంగల్ ఈస్ట్ లో 4.99 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు. మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గం నల్గొండలో 4.87 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గం మంథనిలో 4.89 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని తెలిపారు. ఆశ్చర్యకరంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంతో పాటు ఏకంగా 9 స్కూళ్ల టెండర్లను ఈ ప్రభుత్వం అదే సంస్థకు కట్టబెట్టిందని పేర్కొన్నారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే ఎక్కువ ధరకు టెండర్లు ఖరారు కావడం ఈ కుంభకోణానికి నిదర్శనమని చెప్పారు. నాడు కేసీఆర్ పదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఏనాడూ రాజకీయ పక్షపాతం చూపలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు సమానంగా ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. మిషన్ కాకతీయ మొదటి దశ నుంచే, మిషన్ భగీరథ, బీసీ,మైనార్టీ గురుకులాలు ఇలా ఏ పథకమైనా 119 నియోజకవర్గాలకు సమానంగా ఇచ్చారని అన్నారు మెడికల్ కాలేజీలను అన్ని జిల్లాలకు ఇస్తూ, నేటి కాంగ్రెస్ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గానికి కూడా ఇచ్చామని తెలిపారు దళిత బంధు లాంటి గొప్ప పథకాన్ని ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిర చింతకాని నుంచే పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఘనత కేసీఆది అని హరీశ్‌రావు కొనియాడారు.

## ఇందిరమ్మ జీవిత బీమా పథకం

**కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా**

**హైదరాబాద్, మార్చి 20 :** తెలంగాణ ప్రజల కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం తీసుకువస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ పథకం వల్ల రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకాన్ని జూన్ 2వ తేదీ నుంచి అమలు చేస్తామని ఆయన వివరించారు. 2026–27 వార్షిక బ్జడెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర వార్షిక బ్జడెట్ రూ.3,24,234 కోట్ల అంచనాలతో రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల మేర ఈ బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి వాహనాలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఘటనలో ఏడుగురు దుర్మరణం

**చెన్నై, మార్చి 20 :** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డుపై వెళుతున్న ఇతర వాహనాలను ఢీకొట్టిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన సేలం జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం ఓ ఆర్టీసీ బస్సు కోయంబత్తూరు నుంచి సేలం బయలుదేరింది. బస్సు ఉత్తమ శోలపురం దగ్గర హైవేపై వెళుతుండగా అదుపుతప్పింది. డివైడర్‌ను దాటుకుని అవతలి వైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఆ రోడ్డుపై వెళుతున్న ఓ బైక్‌తో పాటు టెంపోను ఢీకొట్టింది. బైక్, టెంపో నుజ్జునుజ్జయ్యాయి. బైకుపై ప్రయాణిస్తున్న ఓ మహిళతో పాటు ఆమె కూతురు అక్కడికక్కడే మరణించారు. ఇక.. టెంపోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో 11 నెలల చంటిపాప కూడా ఉండటం విషాదకరం. మాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ సభ్యులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు మొదలుపెట్టారు. గాయపడినవారిని చికిత్స కోసం దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగం కారణంగానే బస్సు అదుపుతప్పి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై సీనియర్ పోలీస్ అధికారి ఒకరు మాట్లాడుతూ.. 'ప్రమాదానికి సంబంధించి పూర్తి దర్యాప్తు జరుగుతోంది. దర్యాప్తు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

## అసెంబ్లీ ఆవరణలో పాము ప్రత్యక్షం

**హైదరాబాద్, మార్చి 20 :** బడ్జెట్ సమావేశాల వేళ అసెంబ్లీ ప్రాంగణంలో పాము కలకలం రేపింది. పాత శాసనమండలి ఆవరణలో అనుకోకుండా జెర్రుగొడ్డు ప్రత్యక్షమైంది. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీస్ వెంటనే అప్రమత్తమై ధైర్యంగా పామును పట్టుకున్నారు. మలక్‌పేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన 2009 బ్యాచ్‌కు చెందిన వెంకటేష్ నాయక్ ఈ సాహసం చేశారు. పామును సురక్షితంగా పట్టుకుని, అటవీ శాఖ అధికారులకు అప్పగించేందుకు తరలించామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడటంలో ట్రాఫిక్ పోలీస్ వేగంగా స్పందించడం ప్రశంసనీయంగా నిలిచింది.

## అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం

**'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్'పై మంత్రి పొంగులేటి సమీక్ష**



**హైదరాబాద్, మార్చి 20 :** అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రాన్నిఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దీనిపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు విపత్తు నిర్వహణపై ఒకే విధమైన శిక్షణను అందించడం, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాణ నష్టాన్ని, ఆర్థిక నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించడం, క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా జిల్లాల్లో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం. విపత్తుల నివారణకు సంబంధించి ఇది ఒక అత్యున్నత పరిశోధన మరియు పాలసీ సపోర్ట్ కేంద్రంగా పనిచేస్తుందని అన్నారు. శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో మంత్రి గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి కచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్ టైమ్ మానిటరింగ్, సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్‌లు, హైస్పీడ్ బోట్లు వంటివాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ , అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి, స్పెషల్ పోలీస్ బెటాలియన్ అడిషనల్ డిజీ సంజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



## సాంకేతిక లోపంతో నిలిచిన మెట్రో సర్వీసులు

**కార్యాలయాలకు వెళ్లే సమయంలో ఇబ్బంది**

**హైదరాబాద్, మార్చి 20 :** నగరవాసులకు అత్యంత వేగవంతమైన ప్రయాణాన్ని అందించే హైదరాబాద్ మెట్రోలో మరోసారి సాంకేతిక సమస్య తలెత్తింది. అమీర్‌పేట్ –రాయదుర్గం (బ్లూ లైన్) మార్గంలో శుక్రవారం ఉదయం సాంకేతిక కారణాల వల్ల రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాయదుర్గం వైపు వెళ్తున్న మెట్రో రైలు జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ స్టేషన్‌లో అకస్మాత్తుగా ఆగిపోయింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో దాదాపు 12 నిమిషాల పాటు రైలు అక్కడే నిలిచిపోయింది. సాంకేతిక సమస్యతో మెట్రో సర్వీసులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దాదాపు 20 నిమిషాల పాటు సేవలు నిలిచిపోయాయి. మరమ్మతుల అనంతరం మెట్రో సర్వీసులు కొనసాగుతున్నాయి. రాయదుర్గం–అమీర్‌పేటలో ఓ మెట్రో సాంకేతిక కారణంతో నిలచిపోయింది. దీంతో ఇరు మార్గాల్లో మెట్రో రైళ్లను ఆపేశారు. ఈ క్రమంలో ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందారు. దీని ప్రభావంతో ఈ మార్గంలోని ఇరువైపులా నడిచే రైళ్లపై ప్రభావం పడింది. ఒక్కసారిగా రైళ్లు నిలిచిపోవడంతో కార్యాలయాలకు, ఇతర పనులకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెట్రో సిబ్బంది వెంటనే స్పందించి సాంకేతిక లోపాన్ని సరిచేశారు. సమస్య క్లియర్ కావడంతో రైళ్లు తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రైళ్ల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకుంటు న్నాయని మెట్రో అధికారులు తెలిపారు. అయితే, తరచూ ఇలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మెట్రో యాజమాన్యం సరైన నిర్వహణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## కువైట్-ఇండియా మధ్య విమాన సర్వీసులు

**జజీరా ఎయిర్‌వేస్‌కు ప్రత్యేక అనుమతి**

**న్యూఢిల్లీ, మార్చి 20 :** ఇరాన్ యుద్ధ సంక్షోభ సమయంలో కువైట్–ఇండియా మధ్య విమాన సర్వీసులపై భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జజీరా ఎయిర్‌వేస్‌కు ప్రత్యేక అనుమతి ఇచ్చి ఇరు దేశాల మధ్య విమానాలు నడిపేందుకు అంగీకరించింది. దీంతో ఇరు దేశాల మధ్య, జజీరా ఎయిర్‌వేస్ విమాన సర్వీసులు ప్రారంభం కాబోతున్నాయి. ప్రాంతీయ వైమానిక మార్గాల మూసివేత కారణంగా ఏర్పడిన ప్రయాణ సమస్యలను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కువైట్‌లో భారత రాయబారి పరమితా త్రిపాఠి వెల్లడించారు. గురువారం సాయంత్రం భారత రాయబార కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఇరాన్ యుద్ధం కారణంగా 2026 ఫిబ్రవరి 28 నుండి కువైట్ వైమానిక మార్గాలు తాత్కాలికంగా మూసివేశారు. దీంతో అత్యవసరంగా భారత్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ పరిస్థితిలో, భారత రాయబార కార్యాలయం నిరంతరం అధికారులతో సంప్రదింపులు కొనసాగిస్తూ సహాయం అందిస్తోంది. అత్యవసర ప్రయాణం అవసరమైన వారికి, సౌదీ విమానాశ్రయాల ద్వారా ట్రాన్సిట్ సౌకర్యం కల్పిస్తున్నాం. దీనిలో భాగంగా రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం, సౌదీ ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ఇప్పటివరకు 1,100 మందికి పైగా భారతీయులకు సౌదీ ట్రాన్సిట్ వీసాలు పొందేలా సహాయం చేశాం అని ఆమె తెలిపారు. అలాగే, మానవతా కారణాల దృష్ట్యా మరణించిన వారి మృతదేహాలను భారత్‌కు తరలించే ప్రక్రియలో కూడా కువైట్ అధికారులతో కలిసి పని చేస్తున్నామని తెలిపారు. 'ఇప్పటివరకు 17 మృతదేహాలను భారత్‌కు పంపించాం. ఈ ప్రక్రియను తక్కువ సమయంలో పూర్తి చేయగలిగాం' అని త్రిపాఠి అన్నారు.

## 300 బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై నిషేధం

**న్యూఢిల్లీ, మార్చి 20 :** అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝళిపించింది. 300 బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై నిషేధం విధించింది. వీటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్, బెట్టింగ్ ఎక్స్ఛేంజీలు, సట్టా/మట్కా గ్యాంబ్లింగ్ నెట్‌వర్క్‌లు, రియల్‌మనీ కార్డ్–కెసినో గేమ్ యాప్స్ ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు ఇలాంటి 8,400 వెబ్‌సైట్లు, యాప్స్‌ను నిషేధించింది. బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం కారణంగా యువత పెడదోవ పట్టడం, ఆర్థికంగా చితికిపోతున్నట్లు గ్రహించిన కేంద్ర ప్రభుత్వం.. గతేడాది అక్టోబర్‌లో ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025ను తీసుకొచ్చింది. నగదుతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించింది. ఈ చట్టం అమల్లోకి వచ్చాక 4900 వెబ్‌సైట్లు/యాప్‌లపై చర్యలు చేపట్టింది.

## బీసీలను మోసం చేసిన బడ్జెట్

- ఇచ్చిన హామీ మేరకు దక్కని కేటాయింపులు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**హైదరాబాద్, మార్చి 20 :** ప్రభుత్వం బీసీల గొంతు కోసిందని.. వారిని మోసం చేసిందని,ఇచ్చిన హామీ మేరకు కేటాయింపులు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆరోపించారు. తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీలకు కేటాయించాల్సిన రూ.20 వేల కోట్ల బడ్జెట్ ఎటు పోయిందని ప్రశ్నించారు. తులం బంగారం ఇస్తామని ఇవ్వకుండా చెవిలో పూలు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇచ్చిందని మంత్రి ప్రకటించారని.. ఇప్పుడేమో కేసీఆర్ కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని అబద్దాలు చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల బ్జడెట్‌లో కోతల విధించారని.. ఇంతలా కోతల విధించిన బ్జడెట్‌ను ఇప్పుడే చూస్తున్నానని విమర్శించారు. బీసీల ఆత్మగౌరవ భూములను లాగే ప్రయత్నాలు చేస్తున్నారని.. బీసీల చెవిలో పువ్వులు పెట్టి మోసం చేశారని ఆరోపించారు. త్వరలోనే బీసీల ఆగ్రహం చూస్తారని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు.

## ఆరు గ్యారెంటీలకు మంగళం

- అంకెల గారడీతో బురిడీ కొట్టించారు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**నిజామాబాద్, మార్చి 20 :** తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ప్రజలను మోసం చేసేదిగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేది శూన్యమని పేర్కొన్నారు. మహిళలు,పేద ప్రజలను, నిరుద్యోగులను వంచించిన బ్జడెట్ అని ఆరోపించారు. ఆరు గ్యారంటీలకు మంగళం పాడిన బడ్జెట్ అని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే స్కీమ్‌లకు సరైన కేటాయింపులు లేవని, అవినీతి అవకాశాలు ఉన్న ప్రాజెక్టులకు భారీ నిధులు కేటాయించారని వెల్లడించారు.గత సంవత్సరం బడ్జెట్ అంచనాలను ఈ ప్రభుత్వం అందుకోలేక పూర్తిగా విఫలమైందని ఇప్పటికే స్పష్టమైందని అన్నారు. అయినా కూడా మళ్లీ అదే విధంగా అంకెల మాయాజాలంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. కోటి 58 లక్షల మహిళలకు ఇస్తానన్న రూ. 2,500 చేయూత పథకం ప్రస్తావనే లేదు. వృద్దులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంపు కేటాయింపులు లేవు.తులం బంగారం హామీ పూర్తిగా మర్చిపోయారు.జాబ్ క్యాలెండర్‌ను పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. రైతు భరోసా పేరుతో హామీలు ఇచ్చినా, ఇప్పటివరకు మూడు పంటలకు ఎగ్గొట్టారని,ఆచరణ కు సాధ్యం కానీ రాజీవ్ యువవికాసానికి మాత్రం బ్జడెట్ లో ప్రతి సారి కేటాయింపులు చేస్తూ వస్తున్నారని ఆరోపించారు.ఈ ప్రభుత్వానికి భూములపై ఉన్న ప్రేమ, ప్రజలకు ఇచ్చిన హామీలపై లేదని తెలిపారు.

## జర్నలిస్ట్ సంక్షేమాన్ని వదిలేసిన ప్రభుత్వం

**బడ్జెట్‌లో ఎక్కడా కానరాని ప్రస్తావన**

**హైదరాబాద్, మార్చి 20 :** రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో జర్నలిస్టులకు మొండి చేయి చూపిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ , ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ ఆరోపించారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి, ఇళ్ల స్థలాలు, హెల్త్ స్కీమ్ ముచ్చట అసలే లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వంలో కంటే తాము అధికంగా సంక్షేమం కోసం నిధులు కేటాస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జర్నలిస్టులను పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో అదనంగా 100 కోట్లు సంక్షేమ నిధిని కేటాయిస్థానని చెప్పి ప్రస్తుత బ్జడెట్‌లో కూడా చిల్లి గవ్వ కేటాయించకపోవడం అన్యాయం అన్నారు. ఇళ్ల స్థలాల ప్రస్తావన చేయకపోవడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు పలుమార్లు కోరినా హెల్త్ కార్డు సంబంధించిన అంశమే బ్జడెట్ ప్రసంగంలో లేక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ తీరును పరిశీలిస్తే జర్నలిస్టులకు ఆరోగ్య భద్రతను అందించే జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను ఈ ప్రభుత్వం శాశ్వతంగా రద్దు చేసిందా అనే అనుమానం కలుగుతుందన్నారు.ఇది తెలంగాణ జర్నలిస్టులకు పూర్తిగా అన్యాయం చేసిన బ్జడెట్ గా తాము భావిస్తున్నట్లు ప్రకటించారు. ఈ బ్జడెట్‌పై తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, టీయూడబ్ల్యూజె కోశాధికారి యోగానంద్ బ్జడెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## చెవిలో పూలు పెట్టిన భట్టి బడ్జెట్

- అన్ని వర్గాలను విస్మరించిన కేటాయింపులు
- చెవిలో పూలతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల విమర్శలు

**హైదరాబాద్, మార్చి 20 :** బడ్జెట్ మొత్తం మోసమని, అన్ని వర్గాల ప్రజల చెవిలో కాంగ్రెస్ ప్రభుత్వం పువ్వులు పెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. బడ్జెట్ మొత్తంలో ఎక్కడ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే అంశమే లేదన్నారు. ఆరు గ్యారంటీల ఊసే తీయలేదని మండిపడ్డారు. కేవలం కుంభకోణాల కోసమే కాంగ్రెస్ సర్కారోళ్లు ఈ బడ్జెట్ పెట్టుకున్నరని ఆరోపించారు. ఈ మేరకు గంగుల కమలాకర్, వివేకానందలో కలసి చెవిలో పూలతో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై బ్జడెట్‌లో ఎలాంటి అంశం లేదని విమర్శించారు. రైతు భరోసాను ఇచ్చిన మాట ప్రకారం ఈ సారైనా ఎకరానికి రూ.15 వేలకు పెంచుతారని ఆశించామని, కానీ ఊసే తీయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆఖరికి ఆ రూ.12 వేల చొప్పున కూడా ఎప్పుడు ఇస్తారో చెప్పలేదని ధ్వజమెత్తారు. రైతులకు ఏడాదికి రూ.12 వేల అంశం కూడా ఉత్తమాటగానే మిగిలిపోయిందని విమర్శించారు. ఇక మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డితోసహా కాంగ్రెస్ నేతలు జోరుగా ప్రచారం చేశారని, కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఆ హామీని నెరవేర్చలేదని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది ఆడబిడ్డలను దగా చేయడమేనని మండిపడ్డారు. వృద్ధాప్య పించన్‌లు, వికలాంగ పించన్‌ల విషయంలో కూడా ప్రభుత్వం మాటతప్పిందని విమర్శించారు. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులు రూ.6 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆగ్రహించారు.

# అభిశంసనతో సాధించేదేమిటి?




**సర్ ప్రక్రియలతో అనేక రాష్ట్రాల్లో లక్షల ఓట్లు తొలగించారు. అయితే తొలగించిన ఓట్లకు సంబంధించి ఎక్కడా పెద్దగా ఫిర్యాదులు అందలేదు. దీంతో ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆయా పార్టీలు తిరిగి అధికారం పొందుతాయా అన్న సందేహంలో ఉన్నాయి. ప్రధానంగా బెంగాల్లో మమతా బెనర్జీకి అధికార భయం పట్టుకుంది. సర్‌తో బెంగాల్లో 60 లక్షలకు పైగా ఓట్లు తొలగించారని తెలుస్తోంది. సర్ ప్రక్రియ ముగిసిన తరవాత వివిధ రాష్ట్రాలకు ఎన్నికల నగారా మోగింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దఫాల్లోనూ, మిగిలిన చోట్ల ఏప్రిల్ 9న ఒకే దఫాతో ఎన్నికలు ముగుస్తాయి. ఐదు అసెంబ్లీల పరిధిలో 824 స్థానాలకు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎస్ఐఆర్ పక్రియతో సుమారు కోటీ 40 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. అయితే ఏ రాష్ట్రంలోనూ ప ఎద్దగా వ్యతిరేకత రాలేదు. వ్యతిరేకత కేవలం మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారి నుంచి వచ్చాయి. తాము ఓట్లు కోల్పోయామని పదుల సంఖ్యలో కూడా ఎవ్వరూ ముందుకు రాకపోవడం గమనించాలి. అయి-ంతే ఓటు నమోదులో ఇప్పటికీ శాస్త్రీయ పద్దతిని అవలంబించడం లేదు. పక్కాగా ఓటరు కార్డు దక్కడం లేదు.**

ఓటు నమోదు మొదలు, ఓటు తొలగింపు వరకు అంతా గందరగోళంగా సాగుతోంది. ఈ క్రమంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారు. ఎన్నికల కమిషన్ ఓ రాజ్యాంగ ప్రతిపత్తి గలిగిన సంస్థ. దాని పని అది చేసుకుంటూ పోతున్నది. ఎవరు అధికారంలో ఉన్నా, ఎన్నికల కమిషన్ పనిచేస్తూనే ఉంది. కానీ విపక్ష కాంగ్రెస్, తదితర పార్టీలకు ఇది మింగుడు పడడం లేదు. అందుకు జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన నోటీసులు ఇచ్చారు. ఇది కేవలం రాజ్యాంగ సంస్థ నిజాయితీని నిలదీయడం తప్ప మరోటి కాదు. ఇప్పటికే స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ తదితర పక్షాలు తలబొప్పి కట్టించుకున్నాయి. ఇకపోతే రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 17.4 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల పరిశీలన సర్ పేరుతో తొలగించండతో తట్టుకోలేక పోతున్న ఓట్లను ప్రతిపక్షాలు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను నిలదీసే లక్ష్యంతో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. బెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లో పక్కనే ఉన్న బంగ్లా జాతీయు ఓట్లను తొలగించే ప్రక్రియ జరగింది. అక్రమంగా ఇక్కడ తిష్టవేసి ఓటర్లుగా మారారు. వారే రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉండాలో నిర్ణయించే దశకు చేరుకున్నారు. మరో వైపు ఒక్క చట్టబద్ధమైన ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా చూశామని సిఇసి జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఒక్క అనర్హుడు కూడా ఓటు వేసే అవకాశం లేకుండా చూడటమే తన లక్ష్యమని చెప్పారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రోజుకు లక్ష వరకూ ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాయి. నోటిఫికేషన్ రాగానే బెంగాల్ సిఎస్, డిజిపి, హోం శాఖ కార్యదర్శి, కొల్‌కతా సిపిలను ఇసి బదిలీ చేయడం ద్వారా మమతకు వత్తాసుగా ఉన్న వారిని తొలగించింది.

పశ్చిమ బెంగాల్‌లో పగ్గాలు చేజిక్కించుకోవాలని, కేరళం, తమిళనాడులోనూ అధికారం నిలబెట్టుకునేందుకు ఆయా పార్టీలు చేస్తున్న ప్రయత్నాలకు నిజంగానే సర్ విఘాతం కలిగించి ఉంటుంది. ఓ వైపు మత విద్వేషాలు, హింసను రెచ్చగొట్టడం ద్వారా కుల, మత విభజనను తీసుకురావడం ద్వారా మరోమారు అధికారంలో కొనసాగాలని మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారు ఎత్తులు వేస్తున్నారు. అందుకే మమతా బెనర్జీ ఏకంగా 50శాతం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు నిరాకరించింది. తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని ప్రభుత్వం రెండోసారి అధికారాన్ని నిలబెట్టు కునేందుకు ప్రజాతీర్పును కోరుతోంది. పదేళ్ల పాలనలో అభివృద్ధి చెందిన దేశాల జీవన ప్రమాణాలతో పోటీ పడేలా కేరళంను తీర్చిదిద్ది, తీవ్ర పేదరికాన్ని తరిమేసి, ఎన్నో ఉద్యోగావకాశాలు కల్పించినట్లు పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ చెప్పుకుంటోంది.

ప్రజానుకూల పాలనకు, ప్రజలపై ఉన్న నమ్మకానికి ప్రతీకగా మరోమారు విజయం సాధిస్తామని చెబుతోంది. అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య యుతంగా జరగాలని కోరుకుంటున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. అయితే జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసిండం అంత సులువు కాదు. అధికార ఎన్‌డిఎ పూర్తి మద్దతుతో ఉండండతో ఈ ప్రయత్నం ఎరవేరక పోవచ్చు. అలాగే సర్ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా బీహార్‌లో కాంగ్రెస్ తలబొప్పి కట్టించుకుంది. మమతా బెనర్జీ కూడా సుప్రీంతో చివాట్లు తింది. ఇవన్నీ మరచి వీరు చేస్తే ప్రయత్నాలతో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే పని తప్ప మరోటి కాదని గుర్తించాలి. అలాగే అధికారంలో ఉంటూ మమతా బెనర్జీ లాంటి వారు రాజ్యాంగ విరుద్ద చర్యలకు పాల్పడడం క్షమించరాని నేరంగా పరిగణించాలి.

# నేడు పవిత్ర రంజాన్ పండుగ

## ముగిసిన రంజాన్ ఉపవాసాలు

**హైదరాబాద్, మార్చి 20 :** పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శుక్రవారం నెల వంక ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు. దీంతో నెల రోజుల ఉపవాస దీక్షలను విరమించి పండగను జరుపకోబోతున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో 9వ నెల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి ప్రార్థనలు ఆచరించారు. ఖురాన్ పఠించారు. ముఖ్యంగా ఈ మాసంలో దానధర్మాలు విరివిగా చేస్తారు. పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ఆత్మ పరిశీలనకు, స్వీయ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇలా నెల రోజుల ఉపవాసాల అనంతరం



నెలవంక కనిపించిన తర్వాత ఈద్ అల్ ఫితర్ అంటే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకు నే అతిముఖ్యమైన పండుగల్లో రంజాన్ అత్యంత ప్రధానమైనది. ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో రంజాన్ పండుగను ఆచరించారు. ముస్లిం ఆచరించే చంద్రమాన క్యాలెండర్‌లో రంజాన్ లేదా రమాదన్ అనేది తొమ్మిదో నెల. ఈ రంజాన్ పండుగ ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలు, క్రమశిక్షణ వంటి వాటికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ రంజాన్ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని ముస్లిం పండితులు చెబుతారు. సాధారణంగా సౌదీ అరేబియాలో నెలవంక కనపించిన తర్వాతి రోజు భారత్‌లో రంజాన్ మాసంప్రారంభం కావడం అనేది ఆనవాయితీగా వస్తోంది. ఇక రంజాన్ పండుగ మార్చి 20 తేదీన నెలవంక దర్శనం ఆధారంగా జరుపుకుంటున్నారు.

# విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త

## ఇంటర్‌లో బ్రేక్‌ఫాస్ట్ పథకం

**హైదరాబాద్, మార్చి 20 :** విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రాష్ట్రంలోని ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు అందరికి బ్రేక్ పాస్ట్ పథకాన్ని అందిస్తామని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. బడ్జెట్‌లో ఈ ప్రతిపాదనలను ఉంచారు. అలాగే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుని వస్తున్నామన్నారు. ఈ పథకాలను 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు వివరించారు. శుక్రవారం తెలంగాణ అసెంబ్లీలో ఈ ఏడాది వార్షిక బడ్జెను ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. దివ్యాంగ, శారీరక వైకల్య విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్‌డ్ వాహనాల పంపిణీ చేస్తామని తెలిపారు. సంక్షేమ స్కూళ్లలో వసతుల మెరుగుకు చర్యలు చేపడతామన్నారు. అందుకోసం రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఁష్ట్రంలోని 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాలిటెక్నిక్ కాలేజీల్లో 15 కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. అలాగే స్కిల్ యూనివర్సిటీని విద్యా శాఖ పరిధిలోకి తీసుకు వస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.



2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావతో కూడిన నాణ్యమైన అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం ఇకపై మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తారు. ఁష్ట్ర యువతకు విదేశాలలో సురక్షితమైన ఉపాధి, భాషా నైపుణ్యాలు, వీసా మార్గదర్శకత్వం అందించడానికి ఈ కొత్త ప్రోగ్రాం ప్రారంభిస్తారు. ఇంటర్మీడియట్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు 'రెట్రో ఫి÷-టటెడ్ మోటరైజ్డ్' వాహనాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు.



# బడ్జెట్‌కు కేబినేట్ ఆమోదం

## అమ్మవారి గుడిలో భట్టి పూజలు

**హైదరాబాద్, మార్చి 20 :** అసెంబ్లీలో బడజ్ఎట్ ప్రవేశ పెట్టడానికి ముందు తెలంగాణ కేబినేట్ బడ్జెట్‌ను ఆమోదించింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంత్రివర్గం సమావేశం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన భేటీలో.. రాష్ట్ర బ్జడెట్ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం మధ్యాహ్నం శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రవేశపెట్టారు. అంతకుముందు బడ్జెట్ ప్రతులను తీసుకుని డిప్యూటి సిఎం భట్టి సచివాలయ ప్రాంగణంలోని అమ్మవారి గుడిలో పూజలు నిర్వహించారు.

# శాసనసభ సోమవారానికి వాయిదా

## బడ్జెట్ ప్రసంగాన్ని బహిష్కరించిన బిఆర్ఎస్

**హైదరాబాద్, మార్చి 20 :** తెలంగాణ శాసనసభ సోమవారానికి వాయిదా పడింది. శుక్రవారం సభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. బ్జడెట్ ప్రసంగం పూర్తి అయిన అనంతరం స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. కాగా... ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క బ్జడెట్ ప్రసంగం కొనసాగతుండగానే సభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. అన్ని వర్గాలను మోసం చేశారంటూ.. చెవిలో పూలు పెట్టుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. బ్జడెట్ ప్రతులను చించివేశారు. బ్జడెట్ మొత్తం మోసం.. మోసమంటూ బీఆర్ఎస్ సభలో నిరసనలు తెలిపింది. ఆరు గ్యారంటీలకు బ్జడెట్‌లో కేటాయింపులు లేవంటూ బీఆర్ఎస్ నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. సభ నుంచి బీఆర్ఎస్ నేతల వాకౌట్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. బ్జడెట్ ప్రసంగం ముగిసే వరకు ఆర్థికి మంత్రి భట్టి విక్రమార్క నీళ్ళు కూడా తాగలేదన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు పువ్వులు పెట్టుకొని వెళ్లిపోయారని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్ రావు బ్జడెట్ ప్రతులను చించివేయడం బాధాకరమన్నారు. ఈ బ్జడెట్ పేదలు, బీసీ, ఎస్సీ, విద్యార్థులకు ఉపయోగకరమైనదన్నారు. పేదలు, విద్యార్థుల గురించి మాట్లాడే సమయంలోనే బీఆర్ఎస్ వాళ్ళు వెళ్ళిపోయారని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.

# చంద్రగిరిలోనే తిష్టవేసిన గజరాజులు

**తిరుపతి, మార్చి 20 :** చంద్రగిరి మండలం, ఎల్లంప్లలెలో ఏనుగుల మంద కలకలం రేపింది. గత వారం రోజులుగా గ్రామంలోనే గజరాజులు తిష్ఠ వేశాయి. రాత్రి వేళల్లో పంట పొలాలపై ఏనుగులు విరుచుకుపడుతున్నాయి. ఏనుగుల దాడిలో పంటలు దెబ్బతిన్నాయి. ఏనుగుల నుంచి తప్పించుకునే క్రమంలో పశువుల కాపరి ముత్తు రామయ్యకు గాయాలయ్యాయి. గజరాజుల సంచారంతో ఎల్లంప్లలె గ్రామస్తులు భయాందోళనతో బతుకుతున్నారు. ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు ఫారెస్ట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

# అకాల వర్షంతో అన్నదాత కుదేలు

- దెబ్బతిన్న పలు రకాల పంటలు
- భారీగా నష్టపోయామని ఆందోళన
- రైతులను ఆదుకుంటామన్న మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి, మార్చి 20 :** అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుకూ సాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. అకాల వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే 3-4 రోజులు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతుల్ని అప్రమత్తం చేయాలని అచ్చెన్నాడు చెప్పారు. దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలని అన్నారు. అధికారులు నష్టం వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. ఇకపోతే వరుసగా రెండో రోజూ అకాల వర్షాలు కురవడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని అన్నదాతలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిశాయి. గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి, జి.మాడుగులలో వడగళ్లు పడ్డాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గురువారం కురిసిన మోస్తరు వర్షాలకు మొక్కజొన్న, మినుము, పెసర పంటలు మళ్లీ తడిచాయి. తడిచిన కారణంగా కాయలు రాలిపోతాయని, మినుము రంగుమారిపోతుందని, గింజలు రంగు మారిపోతాయని, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. లంక భూముల్లో కోత అనంతరం ఆరబెట్టిన మిర్చిపంట, ఉడకబెట్టి ఆరబోసిన పసుపు తడిచిపోయాయి. నెల్లూరు జిల్లాలో బుధ, గురువారాల్లో రాత్రిపూట కురిసిన వర్షాలకు కోతకు వచ్చిన వరి పైరు దెబ్బతినగా, మామిడి పూత, పిందెలు నేలరాలాయి. రాపూరు మండలం గోనుపల్లిలో వడగండ్ల వానకు దాదాపు 100 ఎకరాలకుపైగా వరి నేలవాలింది. రాంకూరు, గరిమెనపెంట గ్రామాల్లోని 100 ఎకరాల్లో మామిడి తోటల్లోని పూత, పిందె నేలరాలింది. నిమ్మ తోటల్లో పండ్లు రాలిపోయాయి. అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి, లింగంగుంట, మంగుపలి,?ల కామిరెడ్డిపాడు, అనంతసాగరం గ్రామాల్లో వరి దెబ్బతినగా, గుడిగుంట, గౌరవరం, గుడిగుంట గ్రామాల్లో మిరప, బొప్పాయి, పత్తి మెట్ట పైర్లు దెబ్బతిన్నాయి. కొండాపురం, జలదంకి మండలాల్లో వరి



కోతలు పూర్తి చేసిన రైతులు గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం రాశులను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతపురం జిల్లాలో రైతులకు రూ.1.29 కోట్ల పంటనష్టం వాటిల్లినట్టు అంచనావేశారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం ఎర్రోనిపల్లిలో వడగండ్ల వానకు కర్బూజ పంట ధ్వంసమైంది. తిరుపతి జిల్లాలో 1070 ఎకరాల్లో అరటి, వరి, తమలపాకు పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు సుమారు రూ.10.25 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. బాపట్ల జిల్లాలో గురువారం జల్లులు కురవడంతో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిని కాపాడుకోడానికి రైతులు శ్రమించాల్సి వచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు గ్రామాల్లో గురువారం వడగళు పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పూత, పిందె దశలో ఉన్న మామిడి పంటకు నష్టం వాటిల్లింది. కాపు దశలో ఉన్న జీడిమామిడి సైతందెబ్బతిందని రైతులు చెబుతున్నారు. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో వర్షాలు పడతాయని, గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 23 వరకు కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాష్ట్రంలో విస్తృతంగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం కోస్తాలో శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకు అక్కడక్కడ పిడుగులతో పాటు మోస్తరు వర్షాలు, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయని పేర్కొంది.



# గోదావరి నదిలో మునిగి ఇద్దరు మృతి

## మరో ముగ్గురి కోసం గాలింపు

**భద్రాచలం :** గోదావరి నదిలో స్నానానికి వెళ్లినవారిలో ఐదుగురు యువకులు గల్లంతుకాగా.. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగతా ముగ్గురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం సరిహద్దు ప్రాంతం కూనవరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. అమరావతిలోని ఎస్ఆర్ఎం కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న ఏడుగురు విద్యార్థులు కూనవరం రోడ్డులోని గోదావరి నదిలో స్నానాలు చేసేందుకు దిగారు. నది లోతు తెలియకపోవడంతో ప్రమాదవశాత్తూ వారిలో ఐదుగురు యువకులు గల్లంతవగా, మిగిలిన ఇద్దరు ఒడ్డుకు చేరుకొన్నారు. గమనించిన స్థానికులు వారికోసం బోట్లపై వెళ్లి గాలింపు చర్యలు చేపట్టగా.. చారుగుండ్ల శ్రీకర్ (భద్రాచలం), పొడిచేటి అభిరామ్ (భద్రాచలం) మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ముగ్గురు గోక తేజ (ఉయ్యూరు), నవదీప్ (ఉయ్యూరు), పాశం సతీష్ కుమార్ (మదనపల్లి) కోసం అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గోదావరి ఘటనపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాలింపు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. భవిష్యత్‌లో గోదావరి పరివాహక ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు.



## ఎంపీ ఈటెల రాజేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నేతలు

### ఎంపీని కలిసిన గణేష్, రాహుల్ రెడ్డి

**మేడ్చల్,మార్చ్ 20 (జనంవార్త) :** మల్కాజి గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ జన్మదిన వేడుకలు తన నివాసంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ జన్మ దిన వేడుకలకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షులు గణేష్ తో నాగారం డివిజన్ యువ నాయకులు కౌకుట్ల రాహుల్ రెడ్డి కలసి ఎంపీ ఈటల రాజేందర్ కు శాలువాను కప్పి పుష్పగుచ్చలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాకేష్ యాదవ్,రాగం అర్జున్, అన్నంరాజు సాయి, ప్రకాష్,ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



## దమ్మాయిగూడలో పర్యటించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

- నగర పరిశుభ్రతలో ప్రజలు భాగస్వామ్యం కావాలి
- నాలాలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలి
- కమీషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**కీసర, మార్చ్ 20 (జనం వార్త) :** నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంఎంసి ఆధ్వర్యంలో 99వ రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ,పిఎస్ రావు నగర్,భవాని నగర్ పలు ప్రాంతాలలో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా దుకాణదారులతో కమిషనర్ మాట్లాడారు. వస్తువులను రోడ్డుపై పెట్టి ప్రజలకు ఇబ్బందులకు గురిచేయవద్దని, దుకాణం చెత్తను రోడ్డుపై వేయవద్దని సూచించారు. మళ్లీ రోడ్డుపై చెత్తవేయడం, వస్తువులు రోడ్డుపై పెట్టినయెడల చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అదేవిధంగా గృహ నిర్మాణ కార్యకలాపాల వల్ల ఏర్పడే దుమ్ము, ఇసుక,రాళ్లు తదితర ఇతర వ్యర్థ పదార్థాలను నిర్లక్ష్యంగా రోడ్లపై వేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు. నిర్మాణాలు చేపట్టే యజమానులు సామాగ్రిని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పక్కకు డంప్ చేసుకోవాలని సూచించారు. అనంతరం భవానీ నగర్ లోని నాలాను సందర్శించి,అక్కడి పరిస్థితులను సమీక్షించారు. నాలాలో కూల్చివేత వ్యర్థాలు,ప్లాస్టిక్ చెత్త వల్ల నాలాల్లోని నీటి ప్రవాహం అడ్డంకులకు గురవుతోందని గుర్తించారు. దీనివల్ల వర్షాకాలంలో నీటి నిల్వలు,వరదల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. వెంటనే నాలాలలో ఉన్న చెత్తను వ్యర్థాలను తొలగించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.



కర్ణాటక రాష్ట్రం యాద్గిరి జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ సిద్ధలింగేశ్వర స్వామి ఆలయంలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని శ్రీ సిద్ధలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

– కూకట్‌పల్లి, జనం వార్త



## బడ్జెట్లో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు నిధులు కేటాయించాలి

### బాస్ చీఫ్ కోఆర్డినేటర్ బసవరాజు శ్రీనివాసరావు

**రంగారెడ్డి ప్రతినిధి, మార్చి 20:** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్లో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కు నిధులు కేటాయించాలని అదేవిధంగా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ను కూడా ఏర్పాటు చేయాలని బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ( బాస్) చీఫ్ కోఆర్డినేటర్ బసవరాజు శ్రీనివాసరావు కోరారు. తెలంగాణ ప్రభుత్వం మాసపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కోడూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఐటీ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో బాస్ టీం సభ్యులు నందిరాజు లక్ష్మీనారాయణ, సూర్య ప్రకాష్, ఏలూరి శ్రీనివాస్ రావు, మంగు రాఘవరావు, ప్రమోద్ కొటార్, కైలాస్, జోషి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల వెంకన్నను దర్శించుకున్న బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ దంపతులు

- వివాహ వార్షికోత్సవం,ఉగాది సందర్బంగా స్వామివారికి ప్రత్యేక పూజలు
- స్వామివారి పల్లకి మోసిన శ్రీకాంత్ గౌడ్





**హైదరాబాద్, మార్చ్ 20 (జనం వార్త) :** జనగామ జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, పదిమందికి సాయం చేసే సద్గుణం, మనసున్న మహారాజు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ వివాహ వార్షికోత్సవం తిరుపతి వెంకన్న సన్నిధిలో ఘనంగా జరుపుకున్నారు. పెళ్లి రోజు,ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ రమాదేవి పుణ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి శోభయాత్రలో పాల్గొని పల్లకిని మోసి స్వామివారి ఆశీస్సులకు పాత్రులయ్యారు. అనంతరం దంపతులకు ఆలయ అర్చకులు శాలువాను కప్పి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ తిరుమల శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి పల్లకి మోసే భాగ్యం కలగడం చాలా సంతోషంగా ఉందన్నారు. తిరుమల వెంకన్న ఆశీస్సులతో పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు,మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు లు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరారు.

## రమణాచారి పరామర్శించిన శివప్రసాద్



**కూకట్‌పల్లి, మార్చ్ 2, (జనం వార్త) :** కాలికి శస్త్ర చికిత్స కావడంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఐఏఎస్ అధికారి రమణాచారిని కోపు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు శివ ప్రసాద్, సంస్థ సభ్యులు శుక్రవారం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రమణాచారికి కోపు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు శివ ప్రసాద్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం రమణాచారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రమణాచారి కెపిహెచ్ బి కాలనీ గురించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, సమస్యలు పరిష్కారం అవుతున్నాయా...? అని స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోపు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు శివ ప్రసాద్ మాట్లాడుతూ ఐఏఎస్ అధికారిగా విధుల్లో ఉన్నప్పుడు అధికారులు నిరుపేదల కోసం చేసిన సేవలను ప్రజలు ఎప్పుడు గుర్తుంచుకుంటా రన్నారు. రమణ చారి అధికారిగా విధుల్లో ఉన్నప్పుడు ఎంతో మంది కి నిస్వార్థంగా సేవలందించారని కొనియాడారు. కేపీహెచ్ బి కాలనీ లో థర్డ్ పార్ట రిజిస్ట్రేషన్, మల్టిపుల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను రమణ చారి అధికారిగా విధుల్లో ఉన్నప్పుడే ప్రారంభించారన్నారు. కాలనీ ఏడవ ఫేసు శివాలయంలోని అమ్మవారి ఆలయానికి రావాల్సిందిగా ఆహ్వానించినట్లు తెలిపారు. తాను కోలుకోగానే 10 రోజుల తర్వాత తప్పకుండా వస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోపు స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుబ్బారెడ్డి,విద్యా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద బుడగ జంగాలకు నివాస స్థలాలు కేటాయించాలని వినతి

### సానుకూలంగా స్పందించిన బండి రమేష్



**కూకట్ పల్లి, మార్చ్ 20, (జనం వార్త) :** నిరుపేదలైన బుడగ జంగాల కుటుంబాలకు నివాస స్థలాలను కేటాయించే ప్రయత్నం చేస్తామని టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ బుడగ జంగాల కుటుంబాలకు హామీ ఇచ్చారు. శుక్రవారం పలు బుడగ జంగాల కుటుంబాలు బండి రమేష్‌ను కలిసి గతంలో తాము ఏర్పాటు చేసుకునే గుడిసెలను అధికారులు ప్రభుత్వ భూమి అంటూ గుడిసెలు తొలగించాలని తమ గోడును వినిపించారు. ఖైత్లాపూర్ 995 సర్వేనెంబర్ లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉండే వారం అన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వ అధికారులు ఆ స్థలాన్ని ప్రభుత్వ స్థలమని తమను ఖాళీ చేయించారన్నారు. దీంతో రోడ్డున పడ్డామని తమ బాధను తెలియజేశారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన బండి రమేష్ స్థానిక ఎమ్మార్వో కు ఫోన్ చేసి బుడగ జంగాల నిరుపేద కుటుంబాలకు న్యాయం చేయాలని, ఎక్కడైనా ప్రభుత్వ స్థలం ఉంటే బుడగ జంగాల నిరుపేదలకు గుడిసెలు వేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శ్రీను,రాము, బుడగ జంగాల కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారం

### సుప్రీం కోర్టుకు యాజమాన్యాలు

**దిల్లీ:** తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాలల యాజమాన్యాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28తో కౌన్సెలింగ్ ముగిసిందని, అప్పటికి ఏపీలో 246, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహా, జస్టిస్ అలోక్ అరాథే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరఫు న్యాయవాదులు తీసుకొచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ, గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని కోర్టుకు వివరించారు. గడువు పెంచాలని ఫిబ్రవరి 28కి ముందే.. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేయగా.. ఎలాంటి సమాధానం రాలేదని కోర్టుకు న్యాయవాదులు వివరించారు. ఇదే పరిస్థితి తలెత్తితే.. కర్ణాటక, మహారాష్ట్రల్లో గడువు పెంచారని చెబుతూ.. సంబంధిత ఉత్తర్వులను కోర్టు ముందుంచారు. వైద్య విద్య కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఎన్ఎంసీకి ఆదేశిస్తూ.. తదుపరి విచారణను సర్వోన్నత న్యాయస్థానం మార్చి 23(సోమవారం)కి వాయిదా వేసింది.



## ఎల్లమ్మ బండ మసీదులో పండ్లు, జ్యూస్ పంపిణీ

- ముస్లిం సోదరులకు రాజన్న టీం ఆధ్వర్యంలో ఏర్పాట్లులి
- ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన టీం సభ్యులు

**కూకట్‌పల్లి, మార్చ్ 20, (జనం వార్త) :** పవిత్ర రంజాన్ మాసం ఉపవాసాల చివరి రోజు కావడంతో ఎల్లమ్మ బండలోని మసీదులో రాజన్న టీం సభ్య లు ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులకు పండ్లు, జ్యూస్ అందజేశారు. ఈ సందర్భంగా రాజన్న టీం సభ్యులు బుల్లెట్ రవి మాట్లాడుతూ రాజన్న టీం సభ్యులు చేస్తున్న పలు సేవా కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం మసీదులో ముస్లిం సోదరులకు పండ్లు జ్యూస్ పంపిణీ చేశామన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెల్ల హరికృష్ణ, గుడ్ల శ్రీనివాస్, సయ్యద్ ఇంతియాజ్, కాజా, గిరి, తిరుపతి, యూత్ సభ్యులు శంకర్, నాని, శివ, హర్ష, చింటు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

### బీఆరెస్ నాయకులు కొంచె శివరాజ్



**శేరిలింగంపల్లి జనం వార్త, మార్చి20 :** పవిత్ర రంజాన్(ఈద్–ఉల్–ఫితర్) పండుగ సందర్భంగా, మియాపూర్ బీఆరెస్ నాయకులు కొంచె శివరాజ్ ముదిరాజ్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులందరితో సంతోషంగా రంజాన్ వేడుకలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో ఆధ్యాత్మిక చింతన పెంచుకునే ఈ పండుగ.. సోదరభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. 'రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని కొంచె శివరాజ్ అన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలన్నారు.

# హర్మూజ్ విముక్తికి అమెరికా యత్నాలు

- ఇరాన్ బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం
- యూరోపియన్ దేశాలు సైతం మద్దతు



**వాషింగ్టన్/లండన్, మార్చి 20 :** హర్మూజ్‌పై పట్టుకు అమెరికా యత్నాలు ప్రారంభించింది. ఇరాన్ క్షిపణులను, డ్రోన్లు, బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది. హర్మూజ్ విముక్తికి యూరోపియన్ దేశాలు సైతం మద్దతుగా ముందుకు సాగనున్నాయి. ప్రపంచ చమురు జీవనాడి హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు కీలక పోరును అమెరికా మొదలుపెట్టింది. ఇందుకోసం తీర ప్రాంతంలో ఇరాన్ మోహరించిన క్షిపణి లాంచర్లు, డ్రోన్లు, బోట్లు వంటి లక్ష్యాలను ఛేదించేందుకు తక్కువ ఎత్తులో ఎగిరే అపాచీ అటాక్ హెలికాప్టర్లు , తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలను రంగంలోకి దింపినట్లు అమెరికా సైనికాధికారులను ఉటంకిస్తూ కథనంలో వెల్లడించింది. అమెరికా ఛైర్మన్ ఆఫ్ ది జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. ఈ జలసంధిలో ఇరాన్ సీమైన్స్, బోట్స్, మిసైల్స్ నుంచి ఎదురయ్యే ప్రమాదాల్ని అరికట్టేందుకు ఈ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ప్రాంతాన్ని దిగ్బంధిస్తూ ఇరాన్ పరిచిన ఉచ్చులను పూర్తిగా తొలగించడానికి వారానికి పైగా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ జలసంధి మూసివేతతో చమురు ధరలు 119 డాలర్లను తాకిన విషయం తెలిసిందే. భారీ ఆయుధాలతో ఎ-10 యుద్ధ విమానాలకు తోడు అపాచీ అటాక్ హెలికాప్టర్లను కూడా పంపించింది. ఇవి హర్మూజ్ జలసంధిపై అతితక్కువ ఎత్తులో ఎగురుతూ శత్రులక్ష్యాలను మట్టుబెడుతున్నాయి. ఎ-10 యుద్ధ విమానాలు దక్షిణ తీర ప్రాంతాల్లోని ఇరాన్ ఫాస్ట్ అటాక్ క్రాఫ్టలను లక్ష్యంగా చేసుకొన్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో తమ మిత్ర దేశాలు కొన్ని అటాక్ డ్రోన్లను ఎదుర్కోవడానికి అపాచీ హెలికాప్టర్లను రంగంలోకి దించినట్లు జనరల్ డాన్ కెయిన్ వెల్లడించారు. అయితే.. ఆ దేశాల పేర్లు చెప్పేందుకు నిరాకరించారు. వాస్తవానికి కొన్నాళ్ల నుంచే ఎ-10, అపాచీ హెలికాప్టర్లు ఈ పనిచేస్తున్నట్లు చెప్పారు. వీటికి అండగా ఇప్పటికే ఆ ప్రాంతంలో ÷టైర్ జెట్లు కూడా పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు 120 నౌకలను పేల్చేసినట్లు రక్షణ మంత్రి పీట్‌హెగ్సెత్ వెల్లడించిన విషయం తెలిసిందే. అమెరికా ఎ-10 విమానాలను పదాతి దళాలకు క్లోజ్‌ఎ-యిర్ సపోర్ట్ మిషన్ల కోసం నిర్మించారు. తాజాగా ఇప్పుడు వాటిని నౌకలను ధ్వంసం చేయడానికి వినియోగిస్తున్నారు. దీని ముక్కుపై 30 ఎంఎం గన్ ఉండగా.. రెక్కలపై బాంబులు అమర్చి ఉంటాయి. అమెరికా ఎ-10 విమానాలు జోర్డాన్ కేంద్రంగా ఉన్నాయి. వీటిని గతంలో ఐసిస్‌పై ఆపరేషన్లకు వాడారు. ఇప్పటికే దాదాపు 2,200 మంది అమెరికా మెరైన్ కమాండోలు ఇరాన్ యుద్ధంలో పాల్గొనేందుకు బయల్దేరారు. వీరు ఇరాన్ దక్షిణతీరంలోని ద్వీపాలను స్వాధీనం చేసుకొని హర్మూజ్ జలసంధిపై పట్టు సాధించాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది. ఇదిలావుంటే హోర్ముజ్ జలసంధి రక్షణ ప్రయత్నాల్లో చేరేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అలాగే ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి చర్యలు తీసుకుంటామని ఐరోపా దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్ మరియు కెనడాలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. గల్ఫ్‌లో నిరాయుధ వాణిజ్య నౌకలపై ఇరాన్ ఇటీవల జరిపిన దాడులను, చమురు మరియు గ్యాస్ సహా పౌర మౌలిక సదుపాయాలపై జరిపిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటన పేర్కొంది. హోర్ముజ్ జలసంధిని మూసివేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. తీవ్రమవుతున్న ఘర్షణ పట్ల మేము తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాము. ఇరాన్ తన బెదిరింపులను, డ్రోన్ మరియు క్షిపణి దాడులను, వాణిజ్య నౌకాయానానికి జలసంధిని అడ్డుకునే ఇతర ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 2817కు కట్టుబడి ఉండాలని పిలుపునిస్తున్నామని పేర్కొంది. జలసంధి ద్వారా సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించడానికి తగిన ప్రయత్నాలకు సహకరించేందుకు మేము సిద్ధంగా ఉన్నాము. సన్నాహక ప్రణాళికలో నిమగ్నమైన దేశాల నిబద్ధతను మేము స్వాగతిస్తున్నామని ప్రకటన పేర్కొంది. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను సమన్వయంతో విడుదల చేయడానికి అధికారం కల్పించిన అంతర్జాతీయ ఇంధన సంస్థ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాము. ఉత్పత్తిని పెంచడానికి కొన్ని ఉత్పాదక దేశాలతో కలిసి పనిచేయడంతో సహా, ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి ఇతర చర్యలు తీసుకుంటామని పేర్కొంది.



## మధ్యప్రాచ్యంలో తగ్గని ఉద్రిక్తతలు

- అమెరికా, ఇజ్రాయిల్‌లకు మద్దతు ఇస్తే దాడులు తప్పవు
- గల్ఫ్ దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు

**టెహ్రాన్, మార్చి 20 :** మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరిన తరుణంలో, ఇరాన్ తన పొరుగు దేశాలకు కీలక విజ్ఞప్తి చేస్తూనే పరోక్ష హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడులు చేయడానికి అమెరికాకు, ఇజ్రాయెల్‌కు తమ భూభాగాలను లేదా సైనిక స్థావరాలను ఉపయోగించుకోనివ్వవద్దని పశ్చిమాసియా దేశాలను ఇరాన్ కోరింది. ప్రస్తుత సంక్షోభానికి ప్రాంతీయ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలే ముఖ్య కారణమని ఇరాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ స్థావరాల నుంచే తమపై దాడులు జరుగుతున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాల ప్రకారం.. ఏ దేశం కూడా తన భూభాగాన్ని వేరొక దేశంపై దాడి చేయడానికి మూడవ పక్షానికి ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇవ్వకూడదని ఇరాన్ గుర్తు చేసింది. అమెరికా దాడులకు సహకరించే లేదా సౌకర్యాలు కల్పించే దేశాలను కూడా దురాక్రమణలో భాగస్వాములుగానే పరిగణిస్తామని, అటువంటి స్థావరాలు తమకు 'లక్ష్యాలు' అవుతాయని ఇరాన్ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయ్ హెచ్చరించారు. తమ సార్వభౌమాధికారంపై దాడులు జరిగితే, అంతర్జాతీయ చట్టాల ప్రకారం తమను తాము రక్షించుకునే హక్కు తమకు ఉందని ఇరాన్ స్పష్టం చేసింది. సౌదీ అరేబియా వంటి దేశాలు చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని, ఈ ప్రాంతంలో అస్థిరతకు అమెరికా, జియోనిస్ట్ (ఇజ్రాయెల్) శక్తులే కారణమని ఇరాన్ విమర్శించింది.




## బ్రిటన్ వీసా ఛార్జీల పెంపు..

### ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి..

**బ్రిటన్ :** పర్యాటకులతో పాటు ఉన్నత చదువుల కోసం బ్రిటన్‌కు వెళ్లే విద్యార్థులపైనా ఇకపై మరింత ఆర్థిక భారం పడనుంది. స్టూడెంట్, విజిటర్ సహా అన్ని కేటగిరీల వీసా ఫీజులను పెంచుతున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించింది. వీసా, సెటిల్మెంట్, స్పాన్సర్ లైసెన్స్ ఫీజుల కొత్త ఛార్జీలు ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు హోమ్ ఆఫీస్ ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తుల రుసుములు సుమారు ఆరు నుంచి ఏడు శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. కొత్త విధానం ప్రకారం.. మూడేళ్ల స్కిల్డ్ వర్కర్ (కార్మిక) వీసా దరఖాస్తు రుసుము 769 పౌండ్ల నుంచి 819 (రూ.1,02,470) పౌండ్లకు పెరగనుంది. మూడేళ్లకు పైగా ఉండే దరఖాస్తుల రుసుము 1519 నుంచి 1618 (రూ.2,02,437) పౌండ్లకు పెరగనుంది. విద్యార్థి వీసాల పైనా ఈ పెరుగుదల ప్రభావం కనిపించనుంది. విద్యార్థి వీసా రుసుములు 524 పౌండ్ల నుంచి 558 (రూ.69,814) పౌండ్లకు పెరగనున్నాయి. ఆరు నెలల విజిటర్ వీసా ఛార్జీ 127 పౌండ్ల నుంచి 135 (రూ.16,890) పౌండ్లకు పెరుగుతుంది. స్పాన్సర్ లైసెన్స్, ఈటీఏ ఛార్జీలు సవరించినట్లు బ్రిటన్ వెల్లడించింది.



## అహ్మదాబాద్ ఎయిరిండియా ప్రమాదం

### విమానంలో 11 ఏళ్లుగా సమస్యలు

**న్యూఢిల్లీ :** గత ఏడాది జూన్ 12న ఎయిరిండియా విమానం అహ్మదాబాద్ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో విమానంలోని ప్రయాణికులు సహా మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై విమాన ప్రమాద దర్యాప్తు విభాగం దర్యాప్తు చేస్తోంది. కాగా ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్న ఏఏఐబీ, జాతీయ రవాణా భద్రతా బోర్డులపై అమెరికాకు చెందిన ఫౌండేషన్ ఆఫ్ ఏవియేషన్ సేఫ్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ విమానంలో గత 11 ఏళ్లుగా పలు సాంకేతిక సమస్యలు ఉన్నట్లు వెల్లడించింది. విమానంలో తీవ్రమైన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ సమస్యలు, పవర్ కంట్రోల్ యూనిట్, ఫ్లైట్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్‌లో వైఫల్యాలను గుర్తించినట్లు పేర్కొంది. విమానంలో లోపాలకు సంబంధించి బహిర్గతం కాని పలు పత్రాలను తాము సేకరించామని.. వాటిని క్షుణ్ణంగా పరిశీలించాకే ఈ విషయాన్ని వెల్లడించామని ఎఫ్ఏఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎడ్ పియర్సన్ పేర్కొన్నారు. ఆయా పత్రాలను భారత్‌లోని జాతీయ రవాణా భద్రతా బోర్డు, విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరోకు పంపినప్పటికీ వాటి నుంచి తమకు ఎలాంటి స్పందన రాలేదన్నారు. తాము సేకరించిన వివరాలను ఏఏఐబీ పరిగణలోకి తీసుకుందా, లేదా అనే విషయం తెలుసుకోవడానికి వారికి లేఖ రాసినా ఎటువంటి జవాబు లేదని తెలిపారు. ప్రమాదంపై మ-రోసారి క్షుణ్ణంగా దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఎఫ్ఏఎస్ చేసిన ఆరోపణలపై విమాన ప్రమాద దర్యాప్తు విభాగం స్పందించాల్సి ఉంది.

## ఎరువుల ఉత్పత్తికి ఇంధన పోటు

- ఎరువుల సరఫరాను నిలివిపేయనున్న చైనా
- భారత్ తదితర దేశాలకు రవాణ ఆపే చర్యలు
- పలుదేశాల వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం



**న్యూఢిల్లీ, మార్చి 20 :** ముడి చమురు సరఫరాలో అవాంతరాలతో ఇక్కట్ల పాలవుతున్న ప్రపంచదేశాలకు కొత్త సమస్య వచ్చి పడేటట్టు ఉందన్న భయాలు నెలకొన్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల.. జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది.ఎరువుల ఎగుమతుల్లో ప్రపంచంలో నెం.2గా ఉన్న చైనా వీటి ఎగుమతులపై ఆంక్షలకు సిద్ధమైంది. ఎగుమతుల్లో కోత పెట్టాలని చైనా ఆర్థిక ప్రణాళిక సంస్థ ఎన్‌డీఆర్‌సీ దేశీయ సంస్థలకు సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో జెట్ ఫ్యుయెల్, డీజిల్, కిరోసిన్‌ల ఎగుమతులను తగ్గించాలని గత నెలలో ఎన్‌డీఆర్‌సీ సూచించింది. దేశీయ ఇంధన, ఆహార అవసరాల కోసం చైనా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. చైనా ఎరువులు ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలతో పాటు భారత్‌కూ ఎగుమతి అవుతుంటాయి. కొన్ని దేశాలకు ఎగుమతులను నిలిపివేయాలని తమకు ఆదేశాలు అందాయని షాండాంగ్ ప్రావిన్స్‌లోని ఒక ఫర్టిలైజర్ సంస్థ అధికారి పేర్కొన్నారు. అయితే, ఈ ఆంక్షల విషయమై చైనా ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఎగుమతులకు బ్రేకులు తప్పవని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడు తున్నాయి. దేశీయ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చైనా అన్ని చర్యలు తీసుకుంటుందని అంటున్నాయి. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ డేటా ప్రకారం, ఎరువుల ఎగుమతుల్లో రష్యా నెం.1 కాగా రెండో స్థానంలో చైనా ఉంది. జెట్ ఫ్యుయెల్ ఎగుమతి చేసే దేశాల్లో చైనా ఆరవ స్థానంలో ఉంది. అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం డేటా ప్రకారం.. జెట్ ఇంధనం, డీజిల్, కిరోసిన్‌ల విదేశీ రవాణాను నిలిపివేయాలని చైనా జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్ అక్కడి పరిశ్రమ వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మధ్య నుంచే నైట్రోజన్, పొటాషియం ఎరువుల మిశ్రమాలపై నిబంధనలు విధించింది. ఇప్పటికే యూరియా ఎగుమతిని బ్యాన్ చేసిన బీజింగ్.. అమ్మోనియా సల్ఫేట్ ఎగుమతికి మాత్రం అనుమతినిచ్చింది. ఇంధన, ఆహార నిల్వలు పరిరక్షించుకోవడానికి, దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేయాలని చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ ఎరువుల తయారీ సంస్థకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చినట్లు అక్కడి ఉద్యోగులు వెల్లడించారు. బీజింగ్ నుంచి ఆస్ట్రేలియా, వియత్నాం, భారత్ సహా పలు దేశాలు ప్రస్తుతం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా నుంచి ఎగుమతులు నిలిచిపోవడం వల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత దేశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్‌ఎన్‌జీ సరఫరా లేకపోవడంతో భారత్‌లోని పలు యూరియా కంపెనీలు మూసివేసే పరిస్థితులు నెలకొన్నట్లు ఇటీవల పలు సర్వేలు వెల్లడించాయి.

## ఘర్షణలు ఇలాగే కొనసాగితే

# చమురు 180 డాలర్లకు : సౌదీ

**సౌదీ అరేబియా :** పశ్చిమాసియా ఘర్షణల్లో ఇంధన క్షేత్రాలు టార్గెట్ అవుతున్నాయి. హర్మూజ్ జలసంధిలో అంతరాయాల తో ఇప్పటికే నెలకొన్న చమురు భయాలకు ఈ దాడులు ఆజ్యం పోస్తున్నాయి. జలసంధిలో నౌకల రాకపోకలను ఏప్రిల్ తర్వాత కూడా ఇలానే అడ్డుకుంటే.. చమురు ధర ఒక బ్యారెల్ 180 డాలర్ల వరకు పెరగొచ్చని సౌదీ అరేబియా అంచనా వేస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 28న ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. యుద్ధానికి ముందు బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్‌కు 70 డాలర్లుగా ఉంది. తాజాగా ఒక దశలో అది 119 డాలర్ల కు చేరుకుంది. ఈ పరిణామాలపై సౌదీ విదేశీ వ్యవహారాల నిపుణుడు ఉమర్ కరీం మాట్లాడుతూ.."ఎర్ర సముద్రంలోని టెర్మినల్లపై దాడి జరిగితే.. రవాణాకు అడ్డంకి ఏర్పడితే.. ముడిచమురు ధర 150 డాలర్లకు పెరగడం అసాధ్యమేమీ కాకపోవచ్చు" అని పేర్కొన్నారు. హర్మూజ్ ఎఫెక్ట్‌తో గల్ఫ్ దేశాలు కొత్త మార్గాలపై దృష్టిపెడుతోన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో సౌదీ అరేబియా ఎర్ర సముద్రం మీదుగా చమురు ఎగుమతులను పెంచింది. అక్కడి యాన్బు పోర్టు స మీపంలోని అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే హర్మూజ్ అంతరాయాలు కొనసాగుతుండ గా.. ఎర్రసముద్రం టెర్మినల్ల పైనా దాడులు కొనసాగితే సం క్షోభం మరింత ముదరొచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



### గ్యాస్ ధరలపై భారీ ఎఫెక్ట్..

ఖతార్‌లో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ క్షేత్రం రస్ లఫాన్‌పై ఇరాన్ దాడి చేసిన సంగతి తెలిసిందే. దీని మ-రమ్మతులకు సుదీర్ఘ సమయం పట్టే అవకాశం ఉందని పారిస్‌లోని గ్లోబల్ ఎనర్జీ పాలసీ కేంద్ర పరిశోధకురాలు అన్నె సోఫీ అంచనా వేశారు. "నష్ట ప్రభావం ఏ స్థాయిలో ఉందో ఇంకా మనకు తెలియదు. కానీ ఇతర ఎల్‌ఎన్‌జీ కేంద్రాల్లో గతంలో జరిగిన ఘటనలను బట్టి చూస్తే.. దానిని సాధారణస్థితికి తీసుకురావడానికి నెలల సమయం పట్టొచ్చు. దీంతో గ్యాస్ ధరలపై ప్రభావం భారీగా ఉండొచ్చు" అని పేర్కొన్నారు.

## మొజ్తాబా బతికే ఉన్నారు.. : ఇరాన్



**ఇరాన్ :** ఇరాన్ సుప్రీం నేతగా నియమితులైన మొజ్తాబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితిపై ఇటీవల విభిన్న వార్తలు వినిపించాయి. తాజాగా వీటన్నింటిని తిప్పికొడుతూ.. ఆ దేశం ఓ వీడియోను విడుదల చేసింది. ఇరాన్ అధికారిక మీడియా ఐఆర్‌ఐబీలో ఖమేనీ వీడియో ప్రసారం అయ్యింది. సుప్రీం నేత కొంతమందికి మతపరమైన బోధనలు చేస్తున్నట్లు ఆ వీడియోలో ఉంది. అయితే, ఈ వీడియో ఎప్పటిదనే విషయాన్ని మాత్రం మీడియా స్పష్టం చేయలేదు. అమెరికా- ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో అలీఖమేనీ ప్రాణాలు కోల్పోయిన తర్వాత మొజ్తాబా బాహ్య ప్రపంచానికి కన్పించడం ఇదే తొలిసారి. ఇక, మొజ్తాబా ఆరోగ్యంపై ఇటీవల పలురకాల వార్తలు వినిపించాయి. తొలిరోజు జరిగిన దాడిలో ఆయన తీవ్రంగా గాయపడినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. సుప్రీం నేతగా ఎన్నికైనప్పటికీ ఆయన బహిరంగంగా కన్పించకపోవడంతో.. ఆ ఊహాగానాలు మరింత ఎక్కువయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సుప్రీం నేత ప్రాణాలతో ఉండటంపై అనుమానాలు వ్యక్తంచేయడం తీవ్ర చర్చనీయాంశమయ్యింది. ఈ క్రమంలో తాజాగా ఇరాన్ మీడియా ఆయన వీడియోను విడుదల చేసింది.

## ఇరాన్‌లో యువరెజ్లర్‌కు బహిరంగ ఉరి

**ఇరాన్ :** ఒకవైపు అమెరికా, ఇజ్రాయెల్‌తో పోరాడుతోన్న ఇరాన్.. మరోవైపు అంతర్గత అసమ్మతిని కఠినంగా అణచివేస్తున్నట్లు కనిపిస్తోంది. కొన్నినెలల క్రితం ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలతో సంబంధం ఉన్న ముగ్గురికి మరణశిక్ష అమలు చేసింది. కోమ్ నగరంలో ప్రజలందరి మధ్య బహిరంగా వారిని ఉరితీసింది. వారిలో ఒక రెజ్లర్ కూడా ఉన్నారని స్థానిక మీడియా, మానవ హక్కుల సంఘాలు వెల్లడించాయి. డిసెంబరు 2025లో మొదలైన నిరసనలు కొంతకాలంపాటు కొనసాగాయి. ఆ సమయంలో ఇద్దరు పోలీసుల హత్య ఘటనలో సాలేహ్ మహమ్మద్ (19), సయీద్ దావోది, మెహ్దీ ఘాసెమి ప్రమేయం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఆ నిరసనల్లో భాగమైన వారిని ఉరితీయడం ఇదే తొలిసారని తెలుస్తోంది. ఇలా మరికొన్ని మరణశిక్షలు అమలు కావొచ్చని ఇరాన్ హ్యూమన్ రైట్స్ సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. తాజా ఘటనలో విచారణ పారదర్శకంగా జరగలేదని ఆరోపించింది. రాజకీయ అసమ్మతిని అణచివేసేందుకు భయాన్ని సృష్టించే ఉద్దేశంతో ఈ ఉరిశిక్షలు అమలు చేశారని పేర్కొంది. వీటిని అడ్డుకునేందుకు అంతర్జాతీయ సమాజం తక్షణమే స్పందించాలని కోరింది.



## కుమార్తెతో కలిసి.. ట్యాంకర్‌పై కిమ్ షికారు

**ఉత్తరకొరియా :** ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ కుమార్తె కిమ్-జు-యే మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల స్నైపర్ రైఫిళ్లను ఎక్కిపెట్టిన ఆమె.. తాజాగా తన తండ్రితో కలిసి ఓ ట్యాంకర్‌పై షికారుకు వెళ్లారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కిమ్ తన కుమార్తెతో కలిసి గురువారం ఓ ఆర్మీ ట్రైనింగ్ యూనిట్‌లో పర్యటించారు. ఈసందర్భంగా దళాలు లైవ్ ఫైరింగ్ డ్రిల్స్‌ను వారు పర్యవేక్షించారు. యుద్ధ సన్నాహాలను త్వరగా పూర్తి చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఈ క్రమంలో కిమ్, కుమార్తెతో కలిసి ట్యాంకర్‌పై షికారుకు వెళ్లిన ఫొటోలను కూడా విడుదల చేసింది. కిమ్-జు-యే ట్యాంకర్ లోపల కూర్చొని ఉండగా.. ఆమె తల మాత్రం బయటకి కన్పిస్తోంది. ఇక, బ్లాక్ కోట్ వేసుకున్న కిమ్.. ట్యాంకర్‌పై నవ్వుతూ కూర్చొని ఉన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఈ ఫొటోలు చక్కర్లు కొడుతున్నాయి.

# జెఫ్ బెజోస్ కొత్త ప్రాజెక్ట్.. వేర్‌హౌస్‌లు, ఫ్యాక్టరీల్లోనూ ఏఐ




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగ ప్రవేశం, ఖర్చుల తగ్గింపులో భాగంగా ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్.. కొన్నేళ్లుగా కృత్రిమ మేధ, ఆటోమేషన్ వంటి వాటిపై దృష్టిపెడుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఆ సంస్థ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఉన్న కొన్ని సంస్థలను కొలుగోలు చేసి, వాటి వేర్‌హౌస్‌లు, ఫ్యాక్టరీల్లో ఉద్యోగులకు బదులు.. పూర్తిగా ఏఐని వినియోగించడానికి ప్లాన్ చేస్తున్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. ఇందుకోసం ఆయన 100 బిలియన్ డాలర్లు (రూ. 9లక్షల కోట్లు) సమీకరించేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది. డిఫెన్స్ వస్తువుల తయారీ, ఏరోస్పేస్, చిప్‌మేకింగ్ కంపెనీలను కొనుగోలు చేసి, వాటిలో ఏఐ సాంకేతికతను విస్తరించడమే జెఫ్ బెజోస్ ప్రాజెక్ట్ లక్ష్యం. ఏఐని ఉపయోగించడం వల్ల సదరు కంపెనీల పనితీరును మెరుగుపరచడమే కాకుండా, గిడ్డంగులు, ఉత్పత్తి శ్రేణులలో కార్మికుల అవసరాన్ని తగ్గించేందుకు ఆయన ఈ చర్యలు తీసుకుంటున్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే తక్కువ ఖర్చు, సిబ్బందితో పనులను నిర్వహించగల ఏఐ వ్యవస్థలను ఆయా కంపెనీల అన్ని గోదాములు, ఫ్యాక్టరీల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ సాంకేతికత వల్ల వస్తువుల రూపకల్పన, ఉత్పత్తిలో మానవ వనరుల ఖర్చును భారీగా తగ్గించుకునే వెసులుబాటు ఉంటుంది. గతంలో ఇంజినీర్లు, ఫ్యాక్టరీ సిబ్బంది చేసే పనులను ఇప్పుడు సాఫ్ట్‌వేర్ యంత్రాలు మరింత వేగంగా పూర్తి చేస్తాయి.




# ఐపీఎల్‌కు మూడో ర్యాంకు..

## డబ్ల్యూసీఏపై తీవ్ర విమర్శలు

సంపదపరంగా ప్రపంచంలోనే అత్యంత విలువైన టీ20 లీగ్ ఐపీఎల్. ఇందులో ఒక్కసారి చోటు దక్కించుకుంటే ఆటగాళ్లకు కాసుల వర్షమే. అలాంటి లీగ్‌కు వరల్డ్ క్రికెటర్స్ అసోసియేషన్ మూడో ర్యాంకు ఇవ్వడం గమనార్హం. దీనిపైనే సోషల్ మీడియాలో తీవ్ర స్థాయి-ులో విమర్శలు వస్తున్నాయి. ఐపీఎల్‌లో అందుకొనే పారితోషికంలో కనీసం ఐదోవంతు కూడా ఉండని ది హండ్రెడ్ లీగ్‌కు అగ్రస్థానం ఇచ్చింది. ఇటీవల ముగిసిన ది హండ్రెడ్ లీగ్ వేలంలో అత్యధిక ధరను సొంతం చేసుకొన్న క్రికెటర్‌కు దక్కిన మొత్తం రూ. 4.81 కోట్లు. అదే ఐపీఎల్‌లో అయితే రూ. 25 కోట్ల పైమాటే. కామెరూన్ గ్రీన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ. 25.20 కోట్లు వెచ్చించి మరీ సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికా వేదికగా జరిగే ఎస్‌ఏ20 లీగ్‌కూ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానం దక్కింది. ఇక్కడా టాప్ ప్లేయర్‌కు వచ్చిన మొత్తం కేవలం రూ. 8.3 కోట్లే. అంటే ఐపీఎల్‌లో దేశవాళీ క్రికెటర్ దక్కించుకున్న రూ. 12.40 కోట్ల కంటే చాలా తక్కువే. ఇలాంటి లీగ్‌కు మూడో స్థానం ఇవ్వడమేంటని అభిమానుల నుంచి కామెంట్లు వస్తున్నాయి.

### ఎవరికి ఏ స్థానమంటే?

| | |
|---|---|
| ది హండ్రెడ్ | 75.2 |
| ఎస్‌ఏ20 | 68.0 |
| ఐపీఎల్ | 62.6 |
| బిగ్‌బాష్ లీగ్ | 62.5 |
| పీఎస్ఎల్ | 48.0 |
| ఎంఎల్‌సీ | 43.0 |
| ఐఎల్‌టీ20 | 39.1 |
| సీపీఎల్ | 38.9 |
| అబుదాబి టీ10 | 30.1 |
| బీపీఎల్ | 22.6 |




### ఇవీ అంశాలు..

ర్యాంకులను ప్రకటించేందుకు డబ్ల్యూసీఏ కొన్ని అంశాలను పరిగణన లోకి తీసుకుంది. వాటిని క్రోడీకరించి 100 పాయింట్లకు ఎవరికి ఎంత ఇవ్వాలో నిర్ణయించింది. ఆటగాళ్లకు జీత భత్యాలు, సెక్యూరిటీ, హక్కులు, వృత్తిపరమైన ప్రమాణాలు.. ఇలాంటివాటిని ఎంచుకొని పాయింట్లను కేటాయించింది. ఆటగాళ్లు, వారి అసోసియేషన్లు, ఏజెంట్ల నుంచి సర్వే ఫీడ్‌బ్యాక్ తీసుకొని ర్యాంకులను ప్రకటించింది.

### ఐపీఎల్‌కు తగ్గిందిలా..

ఆటగాళ్లకు ఇచ్చే మొత్తం, చెల్లింపుల వ్యవహారంలో ఐపీఎల్‌కు పూర్తి మార్కులు పడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఐపీఎల్‌కు ఉన్న ఆర్థికబలం మరే జట్టుకు లేదని డబ్ల్యూసీఏ పేర్కొంది. అయితే, ఆటగాళ్ల హక్కుల రక్షణకు సంబంధించి ఐపీఎల్‌కు తక్కువ మార్కులు వచ్చాయి. ఈవిషయంలో ఇంకాస్త మెరుగుకావాల్సిన అవసరం ఉందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ విస్తరణకు లీగ్‌ల కృషి మరువలేనిదని డబ్ల్యూసీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టామ్ మోఫాట్ తెలిపారు. ఇప్పుడీ ర్యాంకుల ఉద్దేశం ఆయా లీగ్‌లను తక్కువ చేయడం కాదని.. మరింత విజయవంతంగా మారేందుకు అవసరమైన సాయం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.



# రూ. 16వేల కోట్ల ఆఫర్‌ను తిరస్కరించిన రాజస్థాన్ రాయల్స్

ఐపీఎల్ 2026 సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఇప్పుడు ఓ వార్త తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫ్రాంచైజీలను అమ్మేందుకు రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఓ భారీ ఆఫర్‌ను రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. ఏకంగా రూ. 16వేల కోట్ల (1.7 బిలియన్ డాలర్లు) బిడ్డింగ్‌నే వద్దని పక్కనపెట్టడం గమనార్హం. కొలంబియా పసిఫిక్ క్యాపిటల్స్ పార్ట్‌నర్స్(సీపీసీపీ) కన్సార్టియం నుంచి ఈ ఆఫర్ వచ్చిందని.. అయినా సరే రాజస్థాన్ మరింత విలువను కోరుకుంటోందని క్రికెట్ వర్గాలు తెలిపాయి. యూఎస్, కెనడాలో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అయిన సీపీసీపీ ఈ బిడ్‌ను దాఖలు చేసింది. కేవలం రెండు వారాల్లోనే మొత్తం సొమ్ము చెల్లిస్తామని వ్యవస్థాపక పార్ట్‌నర్స్ నిశా సచ్‌దేవ, దుబ్జీత్ గుప్తా ముందుకొచ్చారు. అయితే, ఆర్ఆర్ బోర్డు మాత్రం ఆ ఆఫర్‌ను తిరస్కరించింది. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో ఎమెర్జింగ్ మీడియా వెంచర్స్ అధినేత మనోజ్ బదాలె వాటా 65 శాతం కాగా.. రెడ్‌బర్డ్ క్యాపిటల్‌కు మిగతా వాటా ఉంది. అయితే, ఫ్రాంచైజీ విలువ మరింత పెరిగే అవకాశం ఉందనే ఉద్దేశంతో వారు వేచి చూస్తున్నారు.

## భారీగా పెరగనున్న ఆర్సీబీ విలువ



ఐపీఎల్‌లో అత్యంత ప్రజాదరణ కలిగిన జట్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కూడా ఒకటి. ఆ టీమ్ ఒక్కసారి మాత్రమే టైటిల్‌ను నెగ్గినా.. స్టార్ క్రికెటర్లు, మౌలిక వసతులు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో వచ్చే వీక్షణలు, ఇతర అంశాలతో ఆర్సీబీ విలువ భారీగానే ఉండబోతోంది. ఇప్పుడు రాజస్థాన్ రాయల్స్ రూ. 16 వేల కోట్ల బిడ్‌నే వద్దని చెప్పిన నేపథ్యంలో.. ఆర్సీబీ విలువ అంతకంటే ఎక్కువే ఉండొచ్చని సమాచారం. ఆర్ఆర్‌కు వచ్చిన బిడ్డింగ్ కంటే కనీసం 15 నుంచి 20 శాతం అధికంగా కోట్ చేసే అవకాశం లేకపోలేదు. అంటే, రూ. 20 వేల కోట్ల వరకూ విలువ వెళ్లినా ఆశ్చర్యపడనక్కర్లేదు. ఆర్సీబీ కోసం మణిపాల్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రంజన్ పాయ్ సారథ్యంలోని కన్సార్టియం బరిలోకి దిగింది.

# సంజు విషయంలో గంభీర్ మాటే నిజమైంది: శశిథరూర్



అవకాశాల కోసం ఎదురుచూస్తున్నప్పుడు భారత క్రికెటర్ సంజు శాంసన్‌కు కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మద్దతుగా నిలిచారు. టీమ్ఇండియా మేనేజ్‌మెంట్‌పై విమర్శలూ చేశారు. టీ20 ప్రపంచ కప్‌లో అద్భుతమైన ప్రదర్శన చేసిన సంజుశాంసన్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సంజుశాంసన్ గురించి ఆసక్తికర విషయాలను శశిథరూర్ వెల్లడించారు. సంజుకు 14 ఏళ్ల వయసు ఉన్నప్పుడే తనని కలిశానని.. అప్పుడే 'మరో ధోని'గా అభివర్ణించినట్లు గుర్తుచేశాడు. ఇటీవల ఇదే మాటను ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు చెబితే.. సంజుశాంసన్ ఒకేఒక్కడుగా నిలుస్తాడని అన్నాడు. ఇప్పుడా మాటలు గుర్తుచేసుకుంటే నిజమేనని అనిపిస్తోందని థరూర్ వెల్లడించారు. "ఓ రకంగా నేను సంజు విషయంలో మామయ్యలా వ్యవహరించానని అనుకుంటా. అతడికి 14 ఏళ్లు ఉన్నప్పుడే నేను కలిశా. అప్పట్నుంచే చాలా ప్రోత్సహించా. అలా చెప్పేందుకు నేనేమీ క్రికెట్‌కు గొప్ప అభిమానిని కాదు కానీ.. పద్నాలుగేళ్ల వయసులోనే సంజు ఏదో సాధిస్తాడని భావించా. మరో ధోని అవుతాడని ఊహించా. అతడికీ అదే మాట చెప్పా. కొన్నేళ్ల తర్వాత ఇదే మాటలను నా మిత్రుడు గౌతమ్ గంభీర్ వద్ద గుర్తుచేసినప్పుడు.. 'సంజు మరెవరికీ ప్రతిరూపం కావాల్సిన అవసరం లేదు. అతడిని అతడిలానే ఉండనిద్దాం. 'సంజు శాంసన్'లా ప్రత్యేకంగా నిలుస్తాడు' అని అన్నాడు. ఇప్పుడు అదే జరిగింది. ప్రశాంతంగా కేవలం ఆట పైనే దృష్టిపెట్టే సంజుశాంసన్‌కు ముమ్మందూ మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. తప్పకుండా వన్డేల్లోనూ ఆడించాలి. అతడి గత చివరి వన్డేలో సెంచరీ చేశాడు. ఆ తర్వాత అతడిని తప్పించారు" అని శశిథరూర్ వెల్లడించారు.

# వన్డే ప్రపంచ కప్ 2027..

## ఇరవై మందితో ప్రాబబుల్స్ సిద్ధం




ఓ వైపు ఐపీఎల్ 2026 సీజన్ సిద్ధమైంది. మరో ఎనిమిది రోజుల్లోనే మెగా లీగ్ ప్రారంభం కానుంది. ఇది పూర్తయ్యే వరకూ ఏ భారత క్రికెటరూ అంతర్జాతీయ మ్యాచ్ ఆడే అవకాశం ఉండదు. కానీ, బీసీసీఐ సెలక్షన్ కమిటీ మాత్రం నిశ్శబ్దంగా మహాసంగ్రామం కోసం జట్టును సిద్ధం చేసే పనిలో ఉంది. ఇప్పటికే ఓ 20 మందితో కూడిన ప్రాబబుల్స్ లిస్ట్‌ను రెడీ చేసినట్లు సమాచారం. ఇదంతా వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ కోసమేనని క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఐపీఎల్ మ్యాచుల్లోనూ సదరు ప్లేయర్ల ఆటతీరును సెలక్టర్లు దగ్గరుండి గమనిస్తారు. "ప్రతి సెలక్టర్ కచ్చితంగా వారానికి ఒక్క మ్యాచ్ అయినా మైదానానికి వెళ్లి చూడాలి. ఇలా అందరూ కలిసి వారానికి ఐదు మ్యాచులను కవర్ చేసినట్లు అవుతుంది. ఐపీఎల్‌లో మ్యాచులను గమనించడమంటే రాబోయే లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్, టీ20 ప్రపంచ కప్ 2028ను దృష్టిలో ఉంచుకుని మాత్రం కాదు. అలాగని, వన్డే ప్రపంచ కప్ కోసం కొత్తగా స్టార్‌ను వెతికే పనీ లేదు. ఉన్న ప్లేయర్ల ఆటతీరుపై అంచనా వేయాలి. హర్షిత్ రాణా గాయం కారణంగా ఇప్పటికే టోర్నీ నుంచి వైదొలిగాడు. మిగిలిన పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్య ఆటతీరును సెలక్టర్లు ట్రాక్ చేస్తారు" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

### ఆ టెస్టుకూ వారంతా..

ఐపీఎల్ ముగిసిన తర్వాత అఫ్గానిస్థాన్‌తో భారత్ ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడనుంది. ఇదేమీ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగం కానప్పటికీ.. టీమ్ఇండియాలో ప్రతి సీనియర్ ఆటగాడు బరిలోకి దిగుతాడని బీసీసీఐ పేర్కొంది. డబ్ల్యూటీసీ నాలుగో సీజన్‌లో భారత్ ఇంకా తొమ్మిది టెస్టులను ఆడనుంది. బుమ్రా, సిరాజ్ సహా ఇతర పేసర్లు బరిలోకి దిగే అవకాశాలే ఎక్కువ. "భారత టెస్టు క్యాప్‌ను ప్రయోగాలకు వేదికగా మార్చాలనుకోవడం లేదు. అందుకోసం ఇండియా ఌా టూర్లు ఉన్నాయి. ప్రతి టెస్టులోనూ బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ ఆడించేందుకు సెలక్టర్లు దృష్టిసారించారు" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

### అగార్కర్ రిక్వెస్ట్ వార్తలపై..

తన పదవీకాలాన్ని వచ్చే వన్డే ప్రపంచ కప్ వరకూ పొడిగించాలని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ కోరినట్లు వార్తలు వచ్చాయి. అయితే, తమ వద్దకు అలాంటి ప్రతిపాదన ఏదీ రాలేదని బీసీసీఐ వెల్లడించింది. అజిత్ అగార్కర్ పదవీకాలం ఈ ఏడాది సెప్టెంబర్ వరకూ ఉంది. ఆ తర్వాత అజిత్‌తో కలిసి బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా నిర్ణయం తీసుకుంటారని తెలిపింది.



# ప్రీమియం పెట్రోల్ ధర రూ.2 పెంపు

**న్యూఢిల్లీ :** ప్రీమియం పెట్రోల్ ధర లీటర్‌కు రూ. 2.35 పెరిగింది. దేశ వ్యాప్తంగా వీటి ధరలను పెంచినట్లు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) ప్రకటించింది. సాధారణ పెట్రోల్ ధరలు యథాతథంగా ఉన్నాయి. అలాగే, బీపీసీఎల్ స్పీడ్, ఐవోసీఎల్ ఎక్స్‌పీ95 ప్రీమియం పెట్రోల్ ధరలకు కూడా ఈ పెంపు వర్తిస్తుంది. ప్రాంతాన్ని బట్టి లీటరుకు రూ. 2.09 నుంచి రూ. 2.35 వరకూ పెట్రోలియం సంస్థలు ప్రీమియం పెట్రోల్ ధరను పెంచాయి. సవరించిన ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఇండస్ట్రియల్ డీజిల్ ధర లీటర్‌పై రూ. 22 పెరిగింది. సాధారణ డీజిల్ ధరలు యథాతథంగా ఉన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం పడుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### ఏంటీ ప్రీమియం పెట్రోల్?

ప్రస్తుతం దేశంలో మూడు రకాలుగా పెట్రోల్ లభిస్తోంది. ఒకటి సాధారణ పెట్రోల్, మరొకటి ప్రీమియం. ఇది కాకుండా హై ఆక్టేన్ ప్రీమియం అనే మూడో రకం పెట్రోల్ కూడా ఉంది. మెరుగైన ఇంజిన్ పనితీరు, మైలేజ్ కోసం వాహనాల్లో ప్రీమియం పెట్రోల్‌ను ఉపయోగిస్తారు. ప్రస్తుత ధరల పెంపు హై-ఆక్టేన్, ప్రీమియం పెట్రోల్ వాడే వినియోగదారులను ప్రభావితం చేస్తుంది. బీపీసీఎల్ స్పీడ్, హెచ్‌పీసీఎల్ పవర్, ఐఓసీఎల్ ఎక్స్‌పీ95 పేర్లతో ఈ ప్రీమియం పెట్రోల్‌ను విక్రయిస్తాయి.

### సాధారణ, ప్రీమియం పెట్రోల్ మధ్య తేడా ఏంటి?

పెట్రోల్ గ్రేడ్‌ను దాని ఆక్టేన్ విలువ ఆధారంగా వర్గీకరిస్తారు. భారత్‌లో సాధారణ పెట్రోల్ ఆక్టేన్ విలువ 87 కాగా, అదే ప్రీమియం పెట్రోల్ ఆక్టేన్ విలువ 91గా ఉంది. హై ఆక్టేన్ కలిగిన ఇంధనం ఎక్కువ కంప్రెషన్ రేషియోని కలిగి ఉంటుంది. దీని ఫలితంగా, వాహనం ఇంజిన్‌ను స్టార్ట్ చేసే సమయంలో ఎక్కువ ఇంధనం తీసుకోదు. అంతేకాదు కార్బన్‌పై తక్కువ ప్రభావాన్ని చూపుతుంది. శక్తిమంతమైన ఇంజిన్లు కలిగిన స్పోర్ట్స్ కార్లు, బైక్‌లు, సూపర్ కార్లు, మొదలైన వాటికి ఈ ప్రీమియం పెట్రోల్ ఉత్తమంగా నిపుణులు చెబుతారు.



# ఆరంభ లాభాలు ఆవిరి..

## ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. నిన్నటి భారీ నష్టాల నుంచి కోలుకుని ఉదయం భారీ లాభాల్లో ట్రేడ్ అయిన సూచీలు.. ఆఖర్లో మళ్లీ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో స్వల్ప లాభాలకే పరిమితమయ్యాయి. అదే సమయంలో రూపాయి విలువ మరింత క్షీణించింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86 పైసలు క్షీణించి 93.75 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది. సెన్సెక్స్ ఉదయం 74,559.38 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,207.24) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో దాదాపు వెయ్యి పాయింట్ల మేర లాభపడి 75,286.39 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో సెన్సెక్స్ 325.72 పాయింట్ల లాభంతో 74,532.96 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 112.35 పాయింట్ల లాభంతో 23,114.50 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ట్రెంట్, రిలయన్స్ స్టాక్స్ లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బీఈఎల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండిగో స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4665 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




# మరోమారు పెరిగిన బంగారం ధరలు

## 10గ్రాముల బంగారంపై 650 పెరుగుదల

**న్యూఢిల్లీ, మార్చి 20 :** మధ్య ప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో గురువారం భారీగా పతనమైన బంగారం ధర శుక్రవారం స్వల్పంగా కోలుకుంది. దేశంలో మేలిమి బంగారం ధర సగటున రూ. 650ల మేర పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ. 600ల మేర పెరిగింది. వెండి ధర మాత్రం తిరోగమనంలో కొనసాగుతూ మరో రూ. 5 వేల మేర తగ్గింది (ఉనీటె, ఘాతిలె౹స ఖసతిఇ౹బ నీని ఓజీసఇర 20). గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,50,930కు పెరిగింది. నిన్నటితో పోలిస్తే ధర రూ. 650ల మేర ఎగబాకింది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర కూడా రూ. 600ల మేర పెరిగి రూ. 1,38,350కు చేరుకుంది. నగరంలో వెండి ధర మాత్రం దాదాపుగా నిన్నటి స్థాయిలోనే కొనసాగుతోంది. కిలో వెండి ప్రస్తుతం రూ. 2,64,900గా ఉంది. ఇతర ప్రధాన నగరాల వారీగా చూస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,51,630గా ఉంది. ఢిల్లీలో రూ. 1,51,080గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ. 1,50,930గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ బంగారం ధర రూ. 1,38,990గా ఢిల్లీలో రూ. 1,38,500 వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ. 1,38,350గా ఉంది. దేశంలోని పలు నగరాల్లో వెండి ధరలు తగ్గాయి. కిలో వెండి చెన్నైలో రూ. 2,64,900గా ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో కిలో వెండి రూ. 2,55,000 వద్ద కొనసాగుతోంది.



# కోలీవుడ్ వైపు భాగ్యశ్రీ బోర్సే

ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్న ఇప్పటివరకు యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సరైన హిట్ రాలేదు. కొన్ని సినిమాలు విజయానికి దగ్గరగా వెళ్లినప్పటికీ భాగ్యశ్రీకి మాత్రం కలిసి రావడం లేదు. ప్రజెంట్ తెలుగులో అఖిల్ 'లెనిల్' చిత్రంలో నటిస్తుంది. కానీ ఈ సినిమా కూడా వాయిదాలపై నడుస్తుండటంతో.. ఇప్పుడు ఈ అమ్మడు కోలీవుడ్ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. తమిళంలో ప్రయత్నం చేయాలని భావించిన ఈ హీరోయిన్ రీసెంట్‌గా కొత్త సినిమాకు ఓకే చెప్పినట్లు సమాచారం. తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న 'సెయాన్' సినిమాలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ మూవీని కమల్ హాసన్ తన బ్యానర్‌పై నిర్మిస్తుండటంతో ప్రేక్షకుల్లో హై ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఇప్పుడు ఇందులో భాగ్యశ్రీ భాగం కాబోతున్నట్లు వార్తలు వస్తుండగా.. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. మరి ఈ సినిమాతో అయినా ఈ హీరోయిన్ కెరీర్ టర్న్ అవుతుందేమో వేచి చూడాల్సి ఉంది.

# ధురంధర్ -2 కు మంచి రెస్పాన్స్




దేశభక్తి అంశాలతో కూడిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' ఓ ట్రెండ్ సెట్ చేసింది. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ మూవీ సీక్వెల్ 'ధురంధర్ 2' కూడా బాక్సాఫీసు వద్ద దూసుకెళుతోంది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటుడు రాకేశ్ బేడీ ఈ విజయంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ రెండు సినిమాల్లో కీలకమైన జమీల్ జమాల్ పాత్ర పోషించిన ఆయన.. తన పెర్ఫామెన్స్‌పై హీరో రణ్‌వీర్ సింగ్ ఇచ్చిన ప్రశంసను గుర్తుచేసుకున్నారు. ఈ చిత్ర బృందమంతా సెట్స్‌లో కలివిడిగా ఉండేది. నా పాత్ర షూటింగ్ పూర్తయిన రోజు.. రణ్‌వీర్ మైక్ తీసుకొని 'ఒకవేళ ఈ మూవీ రూ.1000 కోట్లు వసూలుచేస్తే.. అందులో రూ.500 కోట్లు రాకేశ్ వల్లే వస్తాయి' అని చెప్పారు. ఓ నటుడిగా ఇంతకుమించి ఏం కావాలి?' అని పేర్కొన్నారు. సీనియర్ పొలిటీషియన్‌గా నయవంచక పాత్రలో రాకేశ్ బేడీ అదరగొట్టారు. ముఖ్యంగా 'ధురంధర్ 2'లో ఈ పాత్ర ఇచ్చే ట్విస్ట్ ప్రేక్షకులకు ఓ ట్రీట్. బాలీవుడ్‌లో 47 ఏళ్ల ప్రస్థానం రాకేశ్ బేడీది. 'ధురంధర్' డైరెక్టర్ ఆదిత్యధర్ గతంలో తెరకెక్కించిన మరో హిట్ మూవీ 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్'లోనూ నటించారు. సినీప్రియుల ఆసక్తిని దృష్టిలోపెట్టుకొని 'ధురంధర్ 2'ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలిరోజే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ప్రపంచవ్యాప్తంగా రూ.172 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. నెట్ పరంగా రూ.145 కోట్లు అని పేర్కొన్నాయి. ఇందులో దాదాపు రూ.100 కోట్లు హిందీలోనే రావడం గమనార్హం. పెయిడ్ ప్రివ్యూల ద్వారా రూ.40? కోట్లు వచ్చాయని తెలిసింది. నెట్ కలెక్షన్లలో ఫస్ట్‌డే అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ మూవీగా 'ధురంధర్ 2' రికార్డులు నెలకొల్పింది.

# ఉస్తాద్ భగత్ సింగ్ హిట్ టాక్

## దర్శకుడు హరీష్ శంకర్ ఆనందం



ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా బాగుందన్న అభిప్రాయం రావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని దర్శకుడు హరీష్‌శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో... పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్.వై సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఉగాది సందర్భంగా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్ అభిమానులు ఫోన్ చేసి 'అన్నా సినిమా చాలా బాగుంది' అంటున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చేలా సినిమాని మలిచాం. తొలి రోజు నుంచీ ఓ కమర్షియల్ సినిమా తీస్తున్నానని, ఒకప్పటిలా హుషారైన పవన్‌కల్యాణ్ ఇందులో కనిపిస్తారని చెబుతూ వచ్చా. సినిమా చూసినవాళ్లు ఈ సినిమాలో ఇన్ని అంశాలు ఉన్నాయని మాకు తెలియదంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇందులోని ప్రతి పాత్ర బాగా పండింది. అందరికృషితోనే ఇంత మంచి సినిమా చేయగలిగాం అన్నారు. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ థియేటర్ల దగ్గర పండగ వాతావరణం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అమెరికా అనే తేడా లేకుండా అన్ని చోట్లా ప్రేక్షకులు సినిమాని ఆస్వాదిస్తున్నారు. మేం ఊహించిన దానికంటే మంచి స్పందన వచ్చింది. పవన్ కల్యాణ్ వన్ మేన్ షో ఇది. హరీశ్‌శంకర్ ఎంతో బాధ్యతగా 'గబ్బర్‌సింగ్' సినిమాని మించేలా తెరకెక్కించారు. కచ్చితంగా భారీ వసూళ్లు సాధిస్తుందీ చిత్రం' అన్నారు. నిర్మాత రవిశంకర్.వై మాట్లాడుతూ 'పెద్ద హీరో నుంచి వాణిజ్య ప్రధానమైన సినిమా వచ్చి చాలా కాలమైంది. ఇందులో కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలూ ఉన్నాయి. మాకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఈ సినిమా విజయంపై మేం సంతోషంగా ఉన్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో కళా దర్శకుడు ఆనంద్‌సాయి, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

# సొగసు చూడతరమా!




రీతూ వర్మ తన కెరీర్‌ను చిన్న పాత్రలతో ప్రారంభించి, తరువాత హీరోయిన్‌గా మంచి గుర్తింపును సంపాదించుకుంది. జూనియర్ ఎన్టీఆర్, కాజల్ జంటగా నటించిన బాద్ షా సినిమాలో కాజల్ అగర్వాల్ కి చెల్లెలిగా కనిపించి రీతూ వర్మ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత పెళ్లి చూపులు సినిమాలో విజయ్ దేవరకొండ సరసన హీరోయిన్‌గా నటించి ఓవర్‌నైట్ స్టార్‌గా మారింది. సాధారణంగా సినిమాల్లో గ్లామర్ షోకు దూరంగా ఉండే రీతూ వర్మ, సోషల్ మీడియాలో మాత్రం అప్పుడప్పుడు స్టైలిష్ ఫోటోలతో అభిమానులను అలరిస్తుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు కూడా అదే తరహాలో వైరల్ అవుతున్నాయి. లంగా వోని లుక్‌లో, పవిటను కాస్త పక్కకు జరిపి ఎద అందాలు ఫోకస్ అయ్యేలా ఇచ్చిన పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫోటోలపై నెటిజెన్లు భారీగా స్పందిస్తున్నారు. "క్యూట్", "గార్జియస్", "ఆసమ్", "ఫైర్" వంటి కామెంట్లతో పాటు హార్ట్, లవ్ ఎమోజీలతో ఆమెపై తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, సినిమాల్లో క్లాసిక్ లుక్‌తో కనిపించే రీతూ వర్మ, సోషల్ మీడియాలో మాత్రం ట్రెండీ అండ్ గ్లామరస్ అవతార్‌తో ఆకట్టుకుంటోంది.

## సర్కే చునార్ తేరి సర్కే

# పాట వివాదం

## నోరా ఫతేహిపై ముస్లిం సంస్థ ఫత్వా జారీ




కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్' లోని 'సర్కే చునార్ తేరి సర్కే' పాట తీవ్ర వివాదాలకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన ముస్లిం పర్సనల్ దారుల్ ఇఫ్తా అనే మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని సదరు సంస్థ పేర్కొంది. ఇటువంటి ప్రదర్శనలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపుతాయని, ముఖ్యంగా ముస్లిం యువతను తప్పుదోవ పట్టిస్తాయని వారు తమ ఫత్వాలో పేర్కొన్నారు. మరోవైపు ఈ పాటకు దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ఈ విషయాన్ని ధృవీకరించారు. మరోవైపు ఈ వివాదంపై నోరా ఫతేహీ స్పందిస్తూ.. ఈ పాట హిందీ వెర్షన్‌లో తనకేమీ సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. మూడేళ్ల క్రితం సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి నటించే అవకాశం రావడం, అలాగే ఇది 'నాయక్ నహి ఖల్ నాయక్ హూ మై' వంటి ఐకానిక్ సాంగ్ రీమేక్ అని భావించి తాను అంగీకరించానని తెలిపారు. తనకు కన్నడ భాష తెలియదని, మేకర్స్ చెప్పిన అనువాదం అప్పట్లో అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె వివరణ ఇచ్చారు. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో 1970ల నాటి బెంగళూరు నేపథ్యంతో తెరకెక్కిన 'కేడీ: ద డెవిల్' చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది.



# మణిరత్నం.. రహమాన్ కాంబో

## సాయిపల్లవి, విజయ్ సేతుపతి మూవీ

దిగ్గజ దర్శకుడు మణిరత్నం తన ఆస్థాన సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్‌తో మరోసారి చేతులు కలుపబోతున్నాడు. 1992లో 'రోజా' సినిమాతో మొదలైన వీరిద్దరి అద్భుత ప్రయాణం, ఇప్పుడు 19వ సారి ఈ కొత్త సినిమాతో కొనసాగబోతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి హీరోగా నటించబోతుండగా.. 'నేచురల్ స్టార్' సాయి పల్లవి మణిరత్నం సినిమాలో హీరోయిన్‌గా నటించబోతుంది. గత కొద్ది రోజులుగా ఈ సినిమాకు యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ పనిచేస్తారనే ప్రచారం జరిగినప్పటికీ, వాటన్నింటికీ చెక్ పెడుతూ మద్రాస్ టాకీస్ సంస్థ రెహమాన్ పేరును అధికారికంగా ప్రకటించింది. ఒక ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం కోసం రెహమాన్ ఇప్పటికే ఒక పాటను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. మద్రాస్ టాకీస్ మరియు లైకా ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జూలై నాటికి ప్రారంభం కానుంది.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com